Janampower.in
TELTEL/2016/69862
# జనం పవర్
తెలుగు దినపత్రిక
JANAM POWER

| కరీంనగర్ | బుధవారం | 29.04.2026 | సంపుటి : 14 | సంచిక : 318 | పేజీలు: 10 వెల: 5/- |
|---|---|---|---|---|---|
| Karimnagar | Wednesday | 29.04.2026 | Valume : 14 | Issue : 318 | Pages : 10 Cost: 5/- |




Editor: BANDARI MARUTHI

# ధరల పెంపు పుకార్లే

- ఇంధన వినియోగదారులకు కేంద్రం భరోసా!
- ఎన్నికల తర్వాత రేట్లు పెంచే ఆలోచన లేదు..
- నిల్వలు పుష్కలం, వదంతులు నమ్మవద్దు
- లీటరుపై రూ. 25 నష్టపోతున్నా ధరల స్థిరీకరణకే మొగ్గు..
- క్లారిటీ ఇచ్చిన పెట్రోలియం శాఖ



2

# మహిళా బిల్లును ఆమోదించి తీరుతాం

- 40 ఏళ్లుగా విపక్షాలు అడ్డుకుంటూనే ఉన్నాయి..
- అధికారం తమ కుటుంబాలకే ఉండాలన్నదే వారి కోరిక
- మాతృమూర్తుల ఆశీస్సుల కోసమే కాశీకి వచ్చాను..
- రిజర్వేషన్ల అమలుపై వెనక్కి తగ్గేదే లేదు

2





# భవిష్యత్ తరాలకు వరం ఫ్యూచర్ సిటీ

- ప్రపంచ దేశాలకు ధీటుగా నగర ప్రణాళిక
- 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం
- ఓఆర్ఆర్ పెద్ద అసెట్ కానుంది
- అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్
- మెట్రో విస్తరణతో అద్భుత కనెక్టివిటీ
- గ్రామాల ప్రజలు సిటీలో భాగం కావాలి
- ప్రజాప్రతినిధులు సిటీ కోసం కృషి చేయాలి
- మూడు బుల్లెట్ ట్రైన్స్ కేంద్రంగా శంషాబాద్
- ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ నిర్మాణానికి సీఎం రేవంత్ శంకుస్థాపన



**హైదరాబాద్, ఏప్రిల్ 28:** ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకు వరమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరి కృషితోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ సిటీ నిర్మాణం అంత సులభం కాదన్నారు. అయితే పక్కా ప్రణాళికతో ప్రపంచ నగరాలకు దీటుగా నిర్మించబోతున్నామని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే నగరంలో తమనూ కలపాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారని వెల్లడించారు. ప్రజల్ని అభివృద్ధిలో భాగస్వాములు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ చెప్పుకొచ్చారు. రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ శంకుస్థాపన చేశారు.

మిగతా 2 లో

## లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం

### 'గిరి దర్శక్' కొలువులు

భద్రాచలం, ములుగు జిల్లాల్లో నియామక పత్రాలు అందజేసిన సీఎం

గౌరవ వేతనం, ఇందిరమ్మ ఇళ్లు..

వివరాలు 2వ పేజీలో

# ప్రపంచానికి సవాల్‌గా ఉగ్రవాదం

ఉగ్రవాదానికి ఊతమిచ్చే దేశాలను తిప్పికొట్టాలి

షాంఘై సహకార రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్

4



ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఉగ్రవాదంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు.


## నేడు టెన్త్ ఫలితాలు విడుదల

2



# తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగ

నిజామాబాద్‌లో 46 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత!



- రాష్ట్రంలో వడదెబ్బకు ముగ్గురు బలి..
- రికార్డు స్థాయికి విద్యుత్ వినియోగం
- ఒక్కరోజే 256 గిగావాట్ల వాడకం..
- మే నెలలో మరింత పెరగనున్న గిరాకీ

తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత అసాధారణ స్థాయికి చేరుకుంది. మంగళవారం తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదై నిప్పుల కొలిమిని తలపించింది. ఎండల తీవ్రత కారణంగా రాష్ట్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇప్పటికే వడదెబ్బ తగిలి ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా, పిడుగుపాటుకు గురై ఒకరు ప్రాణాలు కోల్పోయారు.

2



## తెలంగాణ డీజీపీగా సీవీ ఆనంద్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం!

యూపీఎస్సీ ఎంపానెల్ సిఫార్సు మేరకు నియామకం

రేపు బాధ్యతల స్వీకరణ

.. వివరాలు 2లో

# రాష్ట్రంలో పుష్కలంగా ఇంధన నిల్వలు



కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర భరోసా!

- డిమాండ్‌ను మించి పెట్రోల్, డీజిల్ సరఫరా
- అపోహలతో నిల్వ చేసుకోవద్దని సూచన
- క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ..
- వాహనదారులకు అందుబాటులో నిత్యం 30 వేల కిలో లీటర్లు

2

## డ్రగ్స్ కేసులో రోహిత్ రెడ్డికి బెయిల్

నేడు జైలు నుంచి విడుదల అయ్యే ఛాన్స్

2





# మహిళా బిల్లును ఆమోదించి తీరుతాం

## 40 ఏళ్లుగా విపక్షాలు అడ్డుకుంటూనే ఉన్నాయి

### వారణాసిలో ప్రధాని మోడీ

**వారణాసి, ఏప్రిల్ 28:** పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టడానికి తాము ఎంతగానో ప్రయత్నించామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కాంగ్రెస్, ఎస్పీ వంటి ప్రతిపక్ష పార్టీల నీచ రాజకీయాల వల్లే ఆ చట్టం అమల్లోకి రాకుండా ఆగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు అభివృద్ధి చెందడం, అసెంబ్లీలు, పార్లమెంట్‌లకు రావడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని..అందువల్లే 40 ఏళ్లుగా ఈ బిల్లును అడ్డుకుంటూనే ఉన్నారని అన్నారు. తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. మహిళా రిజర్వేషన్ అమలు చేయడానికి కృషి చేస్తూనే ఉంటామన్నారు. వారణాసిలో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడమనే మహా యజ్ఞం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నానని..అందుకు మాతృమూర్తుల ఆశీస్సులు తీసుకునేందుకు వారణాసి వచ్చానని ప్రధాని పేర్కొన్నారు. ఈ బిల్లును తేవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని..ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదని అన్నారు. సాధారణ కుటుంబాల మహిళలు పార్లమెంటు, అసెంబ్లీలకు రావాలని కోరుకున్నానని తెలిపారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం అధికారం తమ కుటుంబాలకే పరిమితం కావాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లపై తమ పోరాటం ముగిసిపోలేదని, చట్టాన్ని అమలు చేసే వరకు పోరాడుతూనే ఉంటామన్నారు.

# డీజీపీగా సీవీ ఆనంద్

### ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం



**హైదరాబాద్, ఏప్రిల్ 28:** తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూపీఎస్సీ ఎంపానెల్ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ప్రస్తుతం సీవీ ఆనంద్ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయన డీజీపీగా ప్రమోషన్ పొందనున్నారు. ఈ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ నియామకం అమల్లోకి వస్తుంది. తెలంగాణ ప్రస్తుత డీజీపీ కె. శివధర్ రెడ్డి ఈనెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీస్ బాస్‌గా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఏప్రిల్ నెలాఖరులో ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవి విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కొత్త డీజీపీ ఎంపిక అనివార్యమైంది. అందుకు రాష్ట్రంలోని సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్ల జాబితాను ఇటీవల యూపీఎస్సీ.. రాష్ట్ర ప్రభుత్వం పంపింది. ఆ జాబితాలో 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యా మిశ్రా ఉన్నారు. వారిలో సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీజీపీగా ఎంపిక చేసింది.

# నేడు టెన్త్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్,ఏప్రిల్ 28:** తెలంగాణలో పదో తరగతి పరీక్షా ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు వెల్లడించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఫలితాలను విడుదల చేయనున్నట్లు సమాచారం. మార్చి 14 నుంచి ప్రారంభమైన ప్రధాన పరీక్షలు ఈ నెల 13న పూర్తయ్యాయి. సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ నెల 23వ తేదీతో జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తయింది. మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేస్తామని ముందు నుంచి చెబుతున్నా... తాజాగా ఈనెల 29న విడుదల చేసేందుకు రంగం సిద్ధమైంది. దీంతో పరీక్షల విభాగం అన్ని ఏర్పాట్లు చేసింది.

# డ్రగ్స్ కేసులో రోహిత్ రెడ్డికి బెయిల్

### నేడు జైలు నుంచి విడుదల అయ్యే ఛాన్స్

**హైదరాబాద్, ఏప్రిల్ 28:** మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత మార్చి 14న రాత్రి రోహిత్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొత్తం ముగ్గురిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు పోలీసులు. వారిలో పైలట్ రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, వ్యాపారవేత్త నమిత్ శర్మ ఉన్నారు. రోహిత్ రెడ్డి తరఫున మాత్రమే న్యాయవాదులు హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ మంజూరు కావడంతో బుధవారం చంచల్‌గూడ జైలు నుంచి రోహిత్ రెడ్డి విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మార్చి 14న మొయినాబాద్ ఫాంహౌస్‌లో దాడులు చేసిన పోలీసులు.. కొకైన్, లిక్కర్ బాటిళ్లు, స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో పాల్గొన్న 11 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. వారిలో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి.. ఒక నెలకు పైగా చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఏపికి చెందిన ఓ ఎంపి కూడా దొరికినా స్టేషన్ బెయిల్‌తో బయటకు వచ్చారు.

# సమృద్ధిగా పెట్రోల్, డీజిల్ నిల్వలు

### పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



**హైదరాబాద్, ఏప్రిల్ 28:** రాష్ట్రనీలో పెట్రోల్, డీజిల్ నిల్వలు, సరఫరా సమృద్ధిగా ఉన్నట్లు పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 27 వ తేదీన డిమాండ్ ను మించి పెట్రోల్ , డీజిల్ లను 29,939 కిలో లీటర్లు సరఫరా చేసినట్లు వివరించారు. సగటున రోజుకు 5,883 కిలో లీటర్లు పెట్రోల్, 7,348 కిలో లీటర్లు డీజిల్ కు డిమాండ్ ఉండేదని ఆయన తెలిపారు. కానీ 27 వ తేదీన 11,490 కిలో లీటర్లు పెట్రోల్, 18,449 కిలో లీటర్లు డీజిల్ ను వాహనదారులకు సరఫరా చేసినట్లు తెలిపారు. సరఫరాను క్షేత్ర స్థాయి అధికారులు, పెట్రోల్ కంపెనీల ప్రతినిధులతో రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అపోహాలతో పెట్రోల్, డీజిల్ ను నిల్వచేసుకోవద్దని వినియోగదారులకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ సూచించారు.

# భవిష్యత్ తరాలకు వరం ఫ్యూచర్ సిటీ

మొదటి పేజీ తరువాయి



అలాగే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయాలను ప్రారంభించారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో చాలా మంది నేతలు హైదరాబాద్ అభివృద్ధిని కొనసాగించారని చెప్పారు. ఇప్పుడు నాలుగో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. జపాన్, జర్మనీ, సింగపూర్ వంటి దేశాల్లోని అత్యాధునిక నగరాల తరహాలో, భారత్‌లోనే నాలుగో నగరంగా దీన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం జరుగుతోందన్నారు. మనకున్న అద్భుతమైన ఆర్‌ఆర్‌ఆర్, ఐటీ ఎగుమతులు, కోవిడ్ వ్యాక్సిన్ తయారీలో మన ఘనతలే ఈ నగరానికి స్ఫూర్తి అని తెలిపారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములిచ్చిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈ నగర నిర్మాణానికి సహకరించే వారు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. వచ్చే జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. సిటీ నిర్మాణానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని.. ప్రపంచంతో పోటీపడేలా నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూన్ 2వ తేదీ లోపు ఫ్యూచర్ సిటీ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో హైటెక్ సిటీ అంటే అవహేళన చేశారని.. ఏ నగరానికీ లేని ఔటర్ రింగ్ రోడ్డు హైదరాబాద్‌కు ఉందన్నారు. మూడు కొవిడ్ వ్యాక్సిన్లు తెలంగాణలోనే ఉత్పత్తి అయ్యాయని గుర్తు చేశారు. యుద్ధ విమాన సర్వీస్ సెంటర్లూ హైదరాబాద్‌లో ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీపడేటా ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం ఒక నగరం కాదు, ఇది రాబోయే తరాల తలరాతను మార్చే అద్భుతమన్నారు. ఈ నగర నిర్మాణం అంత సులభం కాదు. ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఫ్యూచర్ సిటీలో కలవాలనుకునే గ్రామాలు... గ్రామ సభల్లో తీర్మానం చేసి ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు ఫ్యూచర్‌సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుందన్నారు. ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల సర్పంచ్‌ల వివరాలు తెప్పించుకోవాలి. తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి.. కలెక్టర్, మంత్రికి పంపాలి. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతాం. ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతాం అని సీఎం అన్నారు. ఇకపోతే కేంద్రం దేశవ్యాప్తంగా ఏడు బులెట్ ట్రైన్లను ప్రకటిస్తే.. అందులో మూడు మన రాష్ట్రానికే రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శంషాబాద్ కేంద్రంగా ముంబై, బెంగళూరు, అమరావతి నగరాలను అనుసంధానిస్తూ బులెట్ రైళ్లు పరుగులు తీయబోతున్నాయని చెప్పారు. కేవలం రైళ్లే కాదు.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో భారీ బస్సు టెర్మినల్‌ను కూడా మనం నిర్మించుకోబోతున్నామని రేవంత్ తెలిపారు. మెట్రో, బులెట్ ట్రైన్, అత్యాధునిక బస్ టెర్మినల్.. ఇవన్నీ ఒకే చోట ఏర్పాటు కాబోతున్నాయన్నారు. త్వరలోనే రంగారెడ్డి జిల్లా ఒక మహా అద్భుతానికి సాక్ష్యం కాబోతోందని చెప్పారు. తాను కూడా ఈ గడ్డ నుండే ఊరికి వెళ్తాను.. అందుకే మీపై ఉన్న అభిమానంతో, ఈ ప్రాంత భవిష్యత్తు కోసం అద్భుతమైన ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ లేనివాడు ఫ్యూచర్ సిటీ అంటున్నాడని కొందరు అంటున్నారు... నా మీద ఏడ్చే వారికి నేను చెప్పేది ఒక్కటే.. మీరు ఏడ్చుకుంటూనే ఉండండి, నేను నా పని చేసుకుంటూనే పోతా.. మీ ఏడుపే నా చెవులకు వినిపించే మధుర సంగీతం అని రేవంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు మహేందర్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి, డిజిపి శిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భానుడి భగభగలు

- నిజామాబాద్‌లో 46 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత!
- రాష్ట్రంలో వడదెబ్బకు ముగ్గురు బలి
- రికార్డు స్థాయికి విద్యుత్ వినియోగం





**హైదరాబాద్, ఏప్రిల్29 :** తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత అసాధారణ స్థాయికి చేరుకుంది. భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. మంగళవారం తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదై నిప్పుల కొలిమిని తలపించింది. ఎండల తీవ్రత కారణంగా రాష్ట్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇప్పటికే వడదెబ్బ తగిలి ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా, పిడుగుపాటుకు గురై ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు ఎవరూ బయటకు రావొద్దని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న హీట్‌వేవ్ కారణంగా పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే 4 నుంచి 6 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తీవ్రమైన ఎండల కారణంగా ఇళ్లలో ఎయిర్ కండీషనర్లు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగింది. ఫలితంగా దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం ఆల్ టైమ్ హై రికార్డులను తాకుతోంది. సోమవారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా గరిష్ఠంగా 255.85 గిగావాట్ల విద్యుత్తును వినియోగించినట్లు కేంద్ర విద్యుత్ శాఖ వెల్లడించింది. ఏప్రిల్ రెండో వారం నుంచి విద్యుత్ గిరాకీ గణనీయంగా పెరుగుతూ వస్తోంది. గత శనివారం (ఏప్రిల్ 25) 256.11 గిగావాట్ల వినియోగం జరగగా, ఆదివారం సెలవు దినం కావడం మరియు కొన్ని చోట్ల వర్షాలు కురవడంతో వినియోగం 238 గిగావాట్లకు తగ్గింది. మళ్లీ సోమవారం నుంచి వినియోగం పీక్ స్థాయికి చేరుకోవడం గమనార్హం. గత ఏడాదితో పోలిస్తే ఈసారి విద్యుత్ వాడకం ముందే పెరిగింది. 2025 జూన్‌లో గరిష్ఠ వినియోగం 242 గిగావాట్లుగా ఉండగా, ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఆ రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. మే నెలలో ఎండలు మరింత ముదరనున్న నేపథ్యంలో, దేశీయ విద్యుత్ గిరాకీ 270 గిగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఐఎండీ హెచ్చరికల ప్రకారం ఈ ఏడాది వేసవి కాలం దీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉంది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేసేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. ప్రజలు కూడా సాధ్యమైనంత వరకు విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం

- పర్యాటక గైడ్లుగా 'గిరి దర్శక్' కొలువులు!
- భద్రాచలం, ములుగు జిల్లాల్లో నియామక పత్రాలు అందజేసిన సీఎం
- గౌరవ వేతనంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు..
- 'ఆపరేషన్ కగార్' సత్ఫలితాలన్న రేవంత్




**హైదరాబాద్, ఏప్రిల్28:** రాష్ట్రంలో లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించే ప్రక్రియలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక మైలురాయిని అధిగమించింది. జన జీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టులకు పర్యాటక శాఖలో 'గిరి దర్శక్' (టూరిస్ట్ గైడ్లు) పేరుతో ఉద్యోగ అవకాశాలు కల్పించింది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీరికి నియామక పత్రాలను అందజేశారు. ఒకప్పుడు మావోయిస్టులకు కంచు కోటలుగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల్లోనే వీరు ఇప్పుడు గైడ్లుగా విధులు నిర్వర్తించనున్నారు. వీరికి తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో, పర్యాటక శాఖ సంయుక్తంగా నెల రోజుల పాటు సాఫ్ట్ స్కిల్స్, పర్యాటక అంశాలపై శిక్షణ పూర్తి చేశాయి.

### సత్ఫలితాలిస్తున్న 'ఆపరేషన్ కగార్'

దేశవ్యాప్తంగా మావోయిస్టులు ఆయుధాలు వీడి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కేంద్రం పిలుపునిచ్చిన 'ఆపరేషన్ కగార్', రాష్ట్ర ప్రభుత్వ పునరావాస ప్యాకేజీలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి భారీగా మావోయిస్టులు లొంగిపోతుండటంతో, వారిని సామాజికంగా గౌరవప్రదమైన స్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం ఈ గిరి దర్శక్ పథకాన్ని ముందుకు తెచ్చింది. లొంగిపోయిన వారికి నెలకు రూ. 10,000 గౌరవ వేతనంతో పాటు యూనిఫాంలు కూడా అందజేస్తారు. భవిష్యత్తులో వీరు 'ట్రైనర్ ఆఫ్ ట్రైనర్స్'గా మారి మరికొంత మందికి శిక్షణ ఇచ్చే స్థాయికి ఎదుగుతారని ప్రభుత్వం భావిస్తోంది.

### సంక్షేమ పథకాలతో భరోసా

కేవలం ఉద్యోగాలే కాకుండా, లొంగిపోయిన మావోయిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం గట్టి భరోసా ఇస్తోంది. ఇప్పటికే 99 శాతం మందికి రివార్డుల రూపంలో ఆర్థిక సహాయం అందజేయగా, సుమారు 53 శాతం మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మాజీ మావోయిస్టు నేత గణపతి కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని, ఆయన ఆరోగ్యం మరియు భద్రత బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని విజ్ఞప్తి చేశారు. అడవి బాట పట్టిన వారు తిరిగి వచ్చి సమాజంలో గౌరవంగా బతకాలని, 'గిరి దర్శక్' పథకం దానికి ఒక ప్రత్యక్ష నిదర్శనమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ధరల పెంపు పుకార్లే

**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరుగుతాయంటూ సోషల్ మీడియాలో షికారు చేస్తున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇంధన ధరలను పెంచే ఆలోచన ప్రస్తుతం ప్రభుత్వానికి లేదని పెట్రోలియం మరియు సహజవాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ నెల 29న బెంగాల్ చివరి విడత పోలింగ్ ముగియగానే ధరల మోత తప్పదని వస్తున్న ఊహాగానాలు కేవలం వదంతులేనని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రం భరోసా ఇచ్చింది. దేశవ్యాప్తంగా ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని అధికారులు వెల్లడించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు గత రెండు నెలల్లోనే సుమారు 50 శాతం మేర పెరిగాయి. ముడిచమురు కొనుగోలు వ్యయం పెరగడంతో ఆయిల్ రిటైల్ కంపెనీలు ప్రతిరోజూ సుమారు రూ. 2,400 కోట్ల మేర నష్టాలను చవిచూస్తున్నట్లు అంచనా. ఉత్పత్తి వ్యయానికి, పంపింగ్ ధరలకు మధ్య భారీ వ్యత్యాసం ఉన్నప్పటికీ, గత నాలుగేళ్లుగా సామాన్యులపై భారం పడకుండా ప్రభుత్వం ధరలను స్థిరంగా ఉంచుతూ వస్తోంది. లీటరుకు సుమారు రూ. 20 నుంచి 25 వరకు నష్టం వాటిల్లుతున్నా, ప్రస్తుతానికి రేట్లను సవరించే ప్రతిపాదన ఏదీ లేదని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ వివరించారు. ధరలు పెరుగుతాయన్న తప్పుడు ప్రచారంతో కొన్ని ప్రాంతాల్లో వాహనదారులు భారీగా పెట్రోల్ బంకులకు తరలివచ్చి 'ప్యానిక్ బయింగ్' (అత్యాశతో కొనుగోలు చేయడం)కు పాల్పడుతున్నారని ప్రభుత్వం గుర్తించింది. ఈ పరిస్థితిని అదుపు చేసేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్రం నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. రిటైల్ ఔట్‌లెట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ఎక్కడా 'డ్రై అవుట్' (నిల్వలు నిండుకోవడం) సమస్య రాకుండా అవసరమైన స్టాక్ పంపిణీ చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఎల్‌పీజీ గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సరిపడా ఉన్నాయని, ఎవరూ అనవసరంగా నిల్వలు చేసుకోవద్దని కోరారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించే వరకు వదంతులను నమ్మి ఆందోళనకు గురికావద్దని కేంద్రం విజ్ఞప్తి చేసింది.

# కవిత ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వలే



- కాళేశ్వరం తదితర విషయాలపై ఎందుకు దాటవేస్తున్నారు
- రైతుల గురించి బిఆర్‌ఎస్‌ది మొసలి కన్నీరు
- కెసిఆర్ తీరుపై మండిపడ్డ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, ఏప్రిల్ 28 :** రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేసిందే కాంగ్రెస్ పార్టీ అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఆలోచన చేయడంతోపాటు, పంటలకు మద్దతు ధర చట్టాన్ని తీసుకొచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో తరుగు పేరుతో రైతులను దోపిడీ చేశారని విమర్శించారు. ఏ రైతునూ కలవని కేసీఆర్‌కు తాము ఇబ్బందుల్లో ఉన్నామని చెప్పిందెవరని నిలదీశారు. సారు బయటకి రారు.. ఎవరినీ కలవరు.. అని స్వయంగా కేసీఆర్ కుమార్తె అన్నారు. రాష్ట్ర రైతులను పట్టించుకోని కేసీఆర్.. ఇతర రాష్ట్రాలకు వెళ్లి చెక్కులు ఇచ్చారని ఆమె చెప్పారు. కవిత చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పని కేసీఆర్.. కాంగ్రెస్‌ను తప్పు పడుతున్నారని మండిపడ్డారు. ముందు ఆమె చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఏడాదికి రూ.2,800 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. వరిసాగు విస్తీర్ణంలో తెలంగాణ ఇవాళ పంజాబ్‌ను అధిగమించింది. ఈ సీజన్‌లో కూడా 8వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం నడుపుతోందన్నారు. మసిపూసి మారేడుకాయ చేయడం బీఆర్‌ఎస్ నేతలకు అలవాటు. ధాన్యానికి బోనస్‌గా రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.3 వేల కోట్లు వేశాం. వరికి బోనస్ ఇవ్వాలనే ఆలోచన కేసీఆర్‌కు ఎప్పుడైనా వచ్చిందా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. కేసీఆర్ ఒక్క రైతుబంధు అమలు చేసి అన్ని పథకాలు నిలిపివేశారు. పంట నష్ట పరిహారం, వ్యవసాయ పరికరాలకు సబ్సిడీ ఆపేశారు. ఈ ప్రభుత్వం రైతు భరోసాతోపాటు గతంలోని పథకాలను అమలు చేస్తోంది. బీఆర్‌ఎస్ ఎందుకు ఓడిపోయిందో.. పోస్టుమార్టం చేసుకోవట్లేదు. ఆ పార్టీ నేతలు అహంకార ధోరణిలో ఇంకా ప్రజలనే తప్పుపడుతున్నారని ఆది శ్రీనివాస్ విమర్శించారు. చేసిన తప్పులను కెసిఆర్ కూతరు కవితే బయట పెట్టారని అన్నారు. కాళేశ్వరం సహా అనేక విషయాల్లో సంధించిన ప్రశ్నలకు కెసిఆర్ సమాధానం చెప్పివుంటే హుందాగా ఉండేదని అన్నారు.

# శబరిమలలో మహిళల ప్రవేశంపై విచారణ

### రాజ్యాంగపరమైన ప్రశ్నలపైనే మాదృష్టి

### ఆలయాల అంతర్గత ఆచారాల్లోకి వెళ్లదల్చుకోలేదు : సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో మహిళల ప్రవేశం, ఇతర మతపరమైన ఆచారాలపై దాఖలైన రివ్యూ పిటిషన్లపై సుప్రీంకోర్టులో వాదనలు అత్యంత ఆసక్తికరంగా సాగుతున్నాయి. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల భారీ రాజ్యాంగ ధర్మాసనం ఈ విచారణను చేపట్టింది. ఈ సందర్భంగా రాజ్యాంగ నైతికత, మతపరమైన విశ్వాసాల మధ్య జరుగుతున్న చర్చ దేశవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది. విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టు ధర్మాసనం ఒక కీలకమైన అంశాన్ని స్పష్టం చేసింది. తాము కేవలం రాజ్యాంగపరమైన ప్రశ్నలపై మాత్రమే దృష్టి పెడుతున్నామని, వ్యక్తిగత ఆలయాల అంతర్గత ఆచారాల్లోకి వెళ్లదల్చుకోలేదని కోర్టు తెలిపింది. నిర్దిష్టమైన ఆలయ సంప్రదాయాల కంటే, మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కుల పరిధినే తాము సమీక్షిస్తున్నట్లు వెల్లడించింది. వాదనల సమయంలో ఒక మహిళా న్యాయవాది అస్సాంలోని కామాఖ్య ఆలయ ఉదాహరణను కోర్టు ముందు ఉంచారు. అక్కడ మహిళల రుతుస్రావాన్ని ఒక వేడుకగా జరుపుకొంటారని ఆమె వివరించారు. అదే సమయంలో, అక్కడ జరిగే జంతు బలులను ఆపాలని ఒక పిటిషనర్ కోరగా.. ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆ ప్రస్తావనను తోసిపుచ్చింది. సీనియర్ అడ్వకేట్ శ్రీధర్ పోతరాజు ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. 'మతపరమైన విశ్వాసాలను పరీక్షించేటప్పుడు నాస్తికుల అభిప్రాయాలను కోర్టు పరిగణనలోకి తీసుకోకూడదు' అని ఆయన వాదించారు. మతపరమైన హక్కులు కేవలం భక్తుల కోణం నుంచే చూడాలని, ఆచారాల పట్ల నమ్మకం లేని వారి వాదనలకు ఇక్కడ తావు లేదని ఆయన కోర్టుకు విన్నవించారు. ఆధ్యాత్మిక స్వేచ్ఛ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్-21 (జీవించే హక్కు)లో అంతర్భాగమని శ్రీధర్ పోతరాజు వాదించారు. మతపరమైన ఆచారాల్లో న్యాయస్థానాల జోక్యానికి ఖచ్చితమైన పరిమితులు ఉండాలని న్యాయవాదులు కోరారు. వ్యక్తిగత విశ్వాసాలకు, రాజ్యాంగ నైతికతకు మధ్య ఉన్న సమతుల్యతపై సుదీర్ఘ చర్చ కొనసాగుతోంది.

# సీసీ కెమెరాలను సైతం హ్యాక్ చేస్తున్నారు

### అలాంటి పోలీస్ అధికారులను వదలం

### మాజీమంత్రి హరీష్ రావు హెచ్చరిక



**సంగారెడ్డి, ఏప్రిల్ 28:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ మూర్ఖత్వం.. హిట్లర్‌ను మించిపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌పై దాడి కేసులో జైల్లో ఉన్న బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే క్రిశాంక్‌ను హరీశ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొంత మంది ఐపీఎస్‌లు తమ ఫోన్‌లను.. ఇంటి ముందున్న సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని ఆరోపించారు. బెంగళూరు నుంచి హ్యాకర్లను తీసుకొచ్చి తమపై నిఘా పెడుతున్నారన్నారు. 'అలాంటి అధికారులు జాగ్రత్త.. మీరు రిటైర్డ్ అయినా మిమ్మల్ని వదలం' అని హెచ్చరించారు. మన్నే క్రిశాంక్‌తో పాటు ఏడుగురిపై అక్రమ కేసు పెట్టారని మాజీ మంత్రి మండిపడ్డారు. ప్రశ్నించే వారిపై కాంగ్రెస్ అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. రైతులు, రాష్ట్ర ప్రజల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ఎవరు మాట్లాడితే వాళ్లపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీపై అక్రమ పోస్టులు పెడుతున్నారని పోలీసులకు క్రిశాంక్ ఫిర్యాదు చేశారని తెలిపారు. కాంగ్రెస్ వాళ్లపై కేసులు పెట్టాల్సింది పోయి ఫిర్యాదు చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు పెట్టారని మండిపడ్డారు. నాన్ బెయిలబుల్ కేసు ఎలా పెడతారని ప్రశ్నించారు. బెయిల్ ఇవ్వాల్సిన కేసును పాత కేసులు చూపెట్టి జైల్లో వేశారని ఆరోపించారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తే కేసు పెడతారా అని మాజీ మంత్రి హరీశ్ రావు నిలదీశారు.

# వివాదంలో అషురెడ్డి వ్యవహారం

### పెళ్లిపేరుతో రూ. 9.83 కోట్లు వసూళ్లు

### ధర్మేంద్ర కుటుంబం ఫిర్యాదుతో కేసు నమోదు

### క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన అషురెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 28:** బిగ్ బాస్ ఫేమ్, ప్రముఖ సినీనటి అషురెడ్డి చుట్టూ వివాదాలు ముదురుతున్నాయి. పెళ్లి పేరుతో తనను, తన కుటుంబాన్ని నమ్మించి దాదాపు రూ. 9.83 కోట్లు మోసం చేసిందంటూ బాధితుడు ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఆమెపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ అషురెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బాధితుడు ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఈ కేసులోని ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి. అషురెడ్డి, ధర్మేంద్ర వివాహం చేసుకోవాలని అనుకున్నారని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రముఖ జ్యోతిష్కుడు వేణుస్వామి వద్దకు వెళ్లి ఇరు కుటుంబాలు జాతకాలు కూడా చూపించాయని ప్రచారం జరుగుతోంది. పెళ్లి సాకుతో అషురెడ్డి తన వద్ద నుంచి సుమారు రూ. 9.83 కోట్లు వసూలు చేసిందని ధర్మేంద్ర ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, ఆమె సోదరి దివ్యారెడ్డికి కూడా రూ. 50 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లికి అన్ని సిద్ధమవుతున్న తరుణంలో అషురెడ్డి అకస్మాత్తుగా ధర్మేంద్రను వివాహం చేసుకోవడానికి నిరాకరించినట్లు సమాచారం. అషురెడ్డి తనను మానసికంగా, ఆర్థికంగా వేధించిందని బాధితుడు ధర్మేంద్ర పేర్కొన్నారు. అషురెడ్డి అవసరాల కోసం తాను పలు బ్యాంకుల నుంచి లోన్‌లు తీసుకుని మరీ ఖర్చు చేశానని తెలిపారు. ఇప్పుడు ఆ లోన్‌లు తీర్చలేక ఇబ్బంది పడుతున్నానని ధర్మేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే, తనపై తిరిగి కేసు పెడతానని లేదా ఆత్మహత్య చేసుకుంటానని అషురెడ్డి బెదిరిస్తోందని ఆయన ఫిర్యాదులో తెలిపారు. తన బాయ్‌ఫ్రెండ్ జయంత్‌తో కలిసి అషురెడ్డి ఈ డ్రామా ఆడిందని, తనను మోసం చేసిందని బాధితుడు వాపోతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అషురెడ్డి కుటుంబంపై పోలీసులు కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నేరానికి పాల్పడటం వంటి సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసు నమోదైంది. అయితే తనపై వస్తున్న ఆరోపణలను అషురెడ్డి తోసిపుచ్చారు. ఈ మేరకు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కనీసం తన వెర్షన్ తీసుకోకుండానే పోలీసులు ఏకపక్షంగా కేసు నమోదు చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. తనపై నమోదైన కేసులో వాస్తవం లేదని, కాబట్టి ఆ కేసును వెంటనే కొట్టివేయాలని ఆమె కోర్టును వేడుకున్నారు. ఈ కేసు ఇప్పుడు న్యాయస్థానం పరిధిలో ఉంది. రెండు నెలల క్రితమే ఫిర్యాదు చేసినా, ఇప్పుడు ఈ వ్యవహారం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. అషురెడ్డి పిటిషన్‌పై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# కేంద్రమంత్రితో వాకిటి భేటీ

### రాష్ట్రానికి రావాల్సిన సాయం తదితర అంశాల ప్రస్తావన

**హైదరాబాద్, ఏప్రిల్ 28:** కేంద్రమంత్రి రాజీవ్ రంగన్ సింగ్‌తో వాకిటి శ్రీహరి భేటీ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన సాయం తదితర అంశాలను ప్రస్తావించారు. రాజేంద్ర నగర్ లోని జాతీయ ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో కేంద్ర పశుసంవర్ధక పాడి పారిశ్రామికాభివృద్ధి మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌తో యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మత్స్య శాఖ డైరెక్టర్ నిఖిల, పశు సంవర్ధక శాఖ అధికారి లక్ష్మీనారాయణ తదితరులు ఆయన వెంట ఉన్నారు. పశు సంవర్ధక, పాడి, మత్స్య శాఖల్లో తెలంగాణ అమలు చేస్తున్న పథకాలను కేంద్రమంత్రికి మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. కేంద్రం నుంచి తెలంగాణకు సహకారం ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ను శాలువా, పూల బోకే, మెమోటెంతో ఘనంగా సన్మానించిన మంత్రి వాకిటి శ్రీహరి రాష్ట్రానికి కేంద్రం నుంచి కావలసిన సహకారం, ఆక్వా కల్చర్, లైఫ్ సైన్సెస్ లో ఇన్సూరెన్స్, మోపెడ్ కేటాయింపుల్లో న్యాయం వంటి పలు అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.గోదావరి, కృష్ణా నదుల మధ్య ఉన్న 46 వేల పెద్ద చెరువులు, 26 వేల చిన్న చెరువులు, 100 రిజర్వాయర్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చే నిధులను తీసుకు రావడంలో విఫల మయింది.రాజేంద్రనగర్‌లో ఉన్న ఎన్ఎఫ్‌డిసిని తరలించమని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. తరలింపుపై వస్తున్న ప్రచారంపై కేంద్రమంతి రాజీవ్ రంజన్ దృష్టికి మంత్రి వాకిటి శ్రీహరి తీసుకుపోయారు. దీనిని తరలించే ఆలోచన లేదని కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు.

# చర్లపల్లి స్టేషన్ వద్ద భూమి కేటాయించండి

### సీఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ



**హైదరాబాద్, ఏప్రిల్ 28:** ఆధునీకరించిన చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద సౌకర్యాల కోసం అవసరమైన భూ కేటాయింపులు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ దగ్గర రోడ్లు, పార్కింగ్ కోసం భూమి, సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డు విస్తరణ గురించి లేఖలో ప్రస్తావించారు. చర్లపల్లి స్టేషన్ దగ్గర రోడ్లు ఇరుకుగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. వాటిని విస్తరించాలని కోరారు. పార్కింగ్ కోసం స్టేషన్ దగ్గర అదనంగా 5 ఎకరాల భూమి కావాలన్నారు. అలాగే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద కూడా రోడ్లు ఇరుకుగా ఉన్నాయని.. విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం స్వయంగా వీటిపై దృష్టి సారించాలని కోరారు.

## భారీగా డ్రగ్స్ పట్టివేత

**హైదరాబాద్, ఏప్రిల్ 28 :** గంజాయి, డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నా.. వీటి అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. మంగళవారం హైదరాబాద్ మహానగరంలో భారీ ఎత్తున డ్రగ్స్, విదేశీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీ ఎత్తున డ్రగ్స్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు పట్టుకున్నారు. స్టేషన్‌లో ఇద్దరు మహిళల నుంచి 11.4 కిలోల నిషేధిత అంఫెటమైన్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిద్దరినీ అరెస్ట్ చేసి.. విచారణ కోసం డీఆర్ఐ కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న ఈ డ్రగ్స్ విలువ రూ.11.40 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. సోమవారం బ్యాంకాక్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ప్రయాణికుడి వద్ద నుంచి 6.5 కేజీల విదేశీ గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 2.15 కోట్ల ఉంటుందని తెలిపారు. డీఆర్ఐ అధికారులు ఇచ్చిన ముందస్తు సమాచారం మేరకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మాటు వేసి.. అతడిని పట్టుకున్నామని కస్టమ్స్ అధికారులు వివరించారు. ఎవరికీ అనుమానం రాకుండా లగేజ్ బ్యాగులో దాచి విదేశీ గంజాయిని తీసుకొచ్చినట్లు తెలిసింది. స్మగ్లర్‌పై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కస్టమ్స్ అధికారులు వెల్లడించారు.

# 42శాతంతో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 28:** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బిజెపికి చెందిన రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సోమవారం లేఖ రాశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బీసీ వ్యతిరేక వైఖరిని మార్చుకుని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానం ప్రకారం 42శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం బీసీలను అణచివేసేందుకు ప్రయత్నించినప్పటికీ పంచాయతీ ఎన్నికలలో 53శాతం, మున్సిపల్‌లో 68 శాతం బీసీలు గెలిచి సత్తా చాటారని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లపై కోర్టులో ఉన్న స్టేను ఎత్తివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఎంను ఆయన కోరారు



జనం పవర్
JANAM POWER

బుధవారం
29 ఏప్రిల్ 2026



సంపాదకీయం

# రాజధానిలో రగులుతున్న భూపోరాటం!

## భూసేకరణ సెగ: అమరావతి రైతుల గుండెల్లో రైళ్లు!

రాజధాని అమరావతికి ఇప్పటికే 32వేల ఎకరాలు సేకరించారు. మరో దశలో భూసేకరణకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటి వరకు సేకరించిన భూములకు సంబంధించి రైతులకు సరైన పరిహారం దక్కలేదు. ప్లాట్లు కూడా దక్కలేదు. కౌలు కూడా అరకొరగా అందచేస్తున్నారు. అయినా రైతులు రాజధాని కోసం సర్వస్వం త్యాగం చేశారు. మరిన్ని భూములు సేకరించే ప్రయత్నంలో కొంత వ్యతిరేకత తప్పడం లేదు. మూడు పంటలు పండే, కృష్ణా పరివాహక భూములు ఇవ్వడం సాధ్యం కాదని అంటున్నారు. రైతులకు మంచి ధరలు ఇచ్చి కొనడంలో కూడా సర్కార్ మీనమేషాలు లెక్కిస్తోంది. గతంలో ఇచ్చిన భూముల రైతులకు పెద్దగా దక్కింది కూడా లేదు. ఇప్పుడది చాలదన్నట్టు 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 189 కిలోమీటర్ల పొడవున 250 మీటర్ల వెడల్పుతో ఔటర్ రింగురోడ్డు ఒఆర్ఆర్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో గుంటూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ప్రభావిత ప్రాంతాల రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పరిటాల నుండి ఇబ్రహీంపట్నం వరకూ కృష్ణానదికి సమీపంగా ఒఆర్ఆర్ నిర్మిస్తామంటూ అక్కడి భూయజమానులతో ఇటీవల అధికారులు చెప్పారు. దీంతో ఇప్పటికే మూడుసార్లు భూసేకరణ కింద భూమిని కోల్పోయామనీ, ప్రభుత్వానికి ఇంకెన్నిసార్లు భూములివ్వాలని రైతులు అభ్యంతరం తెలిపారు. మరోమారు భూసేకరణ పిడుగు పడడంతో వారు ఆందోళనలో ఉన్నారు. దేశంలో అనేక ముఖ్య నగరాల్లో ఒఆర్ఆర్, జాతీయ రహదారులు 70 మీటర్ల వెడల్పుతో నిర్మించగా అమరావతి రింగురోడ్డును 250 మీటర్ల వెడల్పుతో నిర్మించే ప్రతిపాదన సరికాదు. రైతుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వ జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్ఎఐ) డిపిఆర్ కూడా సిద్ధం చేసి, ముందుకు పోతుండడం రైతుల ప్రయోజనాలు దెబ్బతీయడమే. వారికి భూమికి భూమి ఇచ్చివుంటే సమస్యలు వచ్చి ఉండేవి కావు. రాజధాని నిర్మాణం, పట్టణాభివృద్ధి పేరిట రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీవ్ర ఒత్తిళ్లకు గురిచేయడం సరైన పద్ధతికాదు. అమరావతి కోసం తొలి దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు డెవలప్ చేసిన ప్లాట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. భూయజమానులకు కౌలు, పేదలకు పింఛన్లు సరిగా అందడం లేదు. ఇబ్బందులిలా వుండగానే ఏలినవారు రెండవ దశ, అనంతరం మరింత విస్తరించడానికి భూములు సమీకరిస్తామని ఊరూరా తిరుగుతుంటే అన్నదాతల గుండెలు అదురుతున్నాయి. అదేపనిగా వేల ఎకరాలు సేకరించడం వెనక రియల్ మోసం ఉందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తొలుత రాజధాని కోసం ప్రతిపాదించిన భూమితో సరిపెట్టుకోకుండా మరోమారు భూసేకరణకు దిగారు. ఇప్పుడు ఓఆర్ఆర్ ప్రతిపాదిస్తున్న మండలాలు, గ్రామాల పరిధిలో భూములు చాలా విలువైనవి. రైతులు, కూలీల జీవనం వాటిపైనే ఆధారపడి ఉంది. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్లో కోటి రూపాయల నుండి రెండుకోట్ల వరకూ ఉంటుంది. భూములు కోల్పోయే రైతులకు వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వకుండా కొన్ని గ్రామాల్లో సచివాలయాల ముందు భూముల సేకరణకు సంబంధించి సర్వే నెంబర్లు, ఎల్‌పి నెంబర్లు సేకరించే భూమి విస్తీర్ణం వంటి వివరాలతో నోటీసులు అతికించారు. ఇందులో ఏ రైతు భూమిని ఎంత విస్తీర్ణం ప్రభుత్వం సేకరించబోతోంది వంటి వివరాలు రైతుల వారీగా లేకపోవడంతో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం పత్రికల్లో చేసిన ప్రకటన, సచివాలయాల్లో వేలాడదీసిన పత్రాలు పారదర్శకంగా లేకపోవడంతో రైతులు భయాందోళనల్లో ఉన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు జరిపి సామాజిక ప్రభావ అంచనా వివరించి రైతులు, ప్రజల సమ్మతి పొందడం అవసరం. అటువంటి చట్టబద్ధమైన ప్రక్రియ అమరావతి ఔటర్‌రింగు రోడ్డు ప్రతిపాదిత గ్రామాల్లో ఇప్పటి వరకూ ఎక్కడా చేపట్టకపోవడం ప్రభుత్వానికి తగదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉన్న భూముల రేటుకు అనుగుణంగా ప్రభుత్వం పరిహారం ఇవ్వాలన్న రైతుల కోర్కె ఎంతో సమంజస మైనది. నయాయబద్ధమైనది కూడా. ఆ ప్రాంతం అభివృద్ధి చెందితే భూముల విలువలు ఎంతగానో పెరుగుతాయని భూ సమీకరణకు రైతులను అంగీకరింపజేయడానికి చెప్పిన ఏలికలు ఆ రైతులకు ఇప్పటి మార్కెట్ విలువనైనా పరిహారంగా చెల్లించలేదు. ఆర్ఆర్‌లో భూమి కోల్పోతున్న ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన 71 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కొత్తగా జాతీయ రహదారి వేయాలనుకున్న ప్రాంతం కృష్ణానది బఫర్‌జోన్లో ఉందని, గతంలో వరదలు వచ్చిన సమయంలో పెద్దఎత్తున ముంపునకు గురయ్యా యని, నీటి ఒత్తిడి కూడా ఎన్‌టిఆర్ జిల్లావైపు ఉంటోందని, వరదలు వచ్చిన సమయంలో నష్టం ఎక్కువగా ఉండటంతోపాటు రోడ్డుకు దక్షిణభాగంలో ఉండే గ్రామాలన్నీ మునిగిపోతాయని ధర్మాసనం ఎదుట మొరపెట్టుకున్నారు. అన్నదాతల వాదనలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన పూర్తి వివరాలు కోర్టుకు సమర్పించాలని ఆర్‌అండ్‌బి, జలవనరులు, ఎన్‌హెచ్ఎఐ అధికారులను ఆదేశించింది. అభివృద్ధి పేరిట భారీగా భూములు గుంజుకుంటున్న ప్రభుత్వం ఇప్పటికైనా విచక్షణతో వ్యవహరించడం అవసరం. ఒఆర్ఆర్ ను 70 మీటర్లకే పరిమితం చేయడం విజ్ఞతగా ఉంటుంది. భూమి కోల్పోయే రైతులను, నష్టపోయే ప్రజలను భాగస్వాములను చేసి వారి ఆమోదంతోనే ముందుకు వెళ్లడం అన్ని విధాలా మంచిది. అలాగే భూములు కావాల్సి వచ్చినప్పుడు బహిరంగ మార్కెట్ ధరలు చెల్లించి సేకరించడం అవసరం. అంతేగానీ రైతులను మభ్యా పెట్టి, వారిని కూలీలుగా దిగజార్చే చర్యలు మాత్రం సహించరానివి.

# సిక్కిం స్వర్ణోత్సవాల్లో మోదీ సందడి

- యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని!
- రూ. 4,000 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- భారత యూనియన్‌లో చేరి 50 ఏళ్లు పూర్తి





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** నరేంద్ర మోదీ సిక్కిం రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌లో సందడి చేశారు. యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. సిక్కిం రాష్ట్ర అవతరణ జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుగుతున్నాయి. మంగళవారం జరగబోయే ముగింపు వేడుకల కోసం ప్రధాని గ్యాంగ్‌టక్ చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫుట్‌బాల్ ఆడారు. సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధాని మంగళవారం ఉదయం అక్కడి క్రీడాకారులతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. ఈ ఆటకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గ్యాంగ్‌టక్‌లో యువ మిత్రులతో కలిసి ఆడడం చాలా ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ప్రధాని స్పోర్ట్స్ దుస్తుల్లో పిల్లలతో కలిసి ఆనందంగా ఫుట్‌బాల్ ఆడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సిక్కిం 50వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముగింపు కార్యక్రమానికి మోదీ హాజరై.. రూ. 4,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఆ రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రోడ్‌షోలో పాల్గొన్నారు. అధికారిక కార్యక్రమాలకు ముందు గ్యాంగ్‌టక్‌లో యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు, వీడియోలను ప్రధాని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవడంతో అవి వేగంగా వైరల్ అయ్యాయి. యువతతో కలిసి క్రీడల్లో పాల్గొనడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని ప్రధాని పేర్కొన్నారు. 'గ్యాంగ్‌టక్‌లో ఉదయం యువ స్నేహితులతో కలిసి ఫుట్‌బాల్ ఆడడం చాలా ఎనర్జీ ఇచ్చిందని మోదీ పేర్కొన్నారు. కాగా, సిక్కింలో ప్రధాని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయబోతున్నారు. సిక్కింలో రహదారుల కనెక్టివిటీ, ఆరోగ్యం, టూరిజం, విద్య, నగర అభివృద్ధి సహా వివిధ రంగాల్లో రూ. 4,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించనున్నారు.

# ప్రపంచానికి సవాల్‌గా మారిన ఉగ్రవాదం

- ఉగ్రవాదానికి ఊతమిచ్చే దేశాలను తిప్పికొట్టాలి
- షాంఘై సహకార రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఉగ్రవాదం పై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగిన పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కిర్గిస్థాన్ లో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గత ఏడాది జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడి గురించి రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తావించారు. పవాల్గామ్ ఉగ్రదాడి ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆ దాడి అనంతరం 'ఆపరేషన్ సింధూర్ చేపట్టి ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భారత్ నిరూపించిందని తెలిపారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండా ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్రదాడులను అస్సలు విస్మరించకూడదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని అన్నారు. ఉగ్రవాదులకు సాయపడుతూ ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో ఎస్‌సీవో వెనకాడకూడదని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం గురించి కూడా ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జరిగిన వరుస ఘర్షణల్లో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, భారీ ఆస్తి నష్టం కూడా వాటిల్లిందని చెప్పారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈ క్రమంలో ఉద్రిక్తతల పరిష్కారానికి దౌత్య మార్గాలను అనుసరించాలన్నారు.

# భారత్ అమ్ములపొదిలోకి మరో 'ఎస్-400'

- మే తొలివారంలో రష్యా నుంచి రాక!
- వాయుసేన శక్తి మరింత పెంపు..
- అమెరికా ఆంక్షల హెచ్చరికలను బేఖాతరు చేసిన భారత్
- మొత్తం 10 యూనిట్ల కొనుగోలుకు ప్రణాళిక..
- 'ఆపరేషన్ సింధూర్' విజయంతో పెరిగిన డిమాండ్



**న్యూఢిల్లీ:** భారత రక్షణ వ్యవస్థలో అత్యంత కీలకమైన ఎస్-400 ట్రియంఫ్ క్షిపణి వ్యవస్థ నాలుగో యూనిట్ అతి త్వరలో మన దేశానికి చేరుకోనుంది. మే నెల ప్రారంభంలోనే ఇది భారత్‌కు అందుతుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే రష్యా నుంచి ఈ యూనిట్ బయలుదేరినట్లు సమాచారం. 2018 అక్టోబర్‌లో ఐదు యూనిట్ల కొనుగోలు కోసం రష్యాతో భారత్ కుదుర్చుకున్న 5 బిలియన్ డాలర్ల ఒప్పందంలో భాగంగా ఇప్పటికే మూడు యూనిట్లు వాయుసేన అమ్ములపొదిలో చేరాయి. తాజా డెలివరీతో శత్రువుల గగనతల దాడులను తిప్పికొట్టే సామర్థ్యం మరింత బలోపేతం కానుంది. చివరిదైన ఐదో యూనిట్‌ను ఈ ఏడాది నవంబర్ నాటికి రష్యా అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

### సత్తా చాటిన 'ఆపరేషన్ సింధూర్'

పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'లో ఎస్-400 క్షిపణి వ్యవస్థలు అద్భుతమైన ప్రతిభ కనబరిచాయి. శత్రుదేశ యుద్ధ విమానాలకు చుక్కలు చూపించి, భారత ఆకాశ సరిహద్దులను పహారా కాయడంలో ఇవి తిరుగులేని శక్తిగా నిరూపితమయ్యాయి. ఈ విజయవంతమైన ఆపరేషన్ తర్వాతే ఎస్-400 వ్యవస్థల సంఖ్యను పెంచుకోవాలని కేంద్ర ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకుంది. గత నెలలో మరో ఐదు యూనిట్ల కొనుగోలుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా మొత్తం 10 ఎస్-400 యూనిట్లు అందుబాటులోకి రానున్నాయి. చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో వీటి మోహరింపు ద్వారా గగనతల రక్షణ కవచం మరింత పటిష్టం కానుంది.

### అమెరికా ఆంక్షలకు తలొగ్గేది లేదు

భారత్-రష్యా రక్షణ ఒప్పందాల పట్ల అగ్రరాజ్యం అమెరికా అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. 'కౌంటరింగ్ అమెరికాస్ అడ్వర్సరీస్ త్రూ శాంక్షన్స్ యాక్ట్' (సీఏఏటీఎస్ఏ) నిబంధనల ప్రకారం భారత్‌పై ఆంక్షలు విధిస్తామని హెచ్చరిస్తున్నప్పటికీ, భారత్ మాత్రం తన జాతీయ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తోంది. తాజా కొనుగోళ్లు పాత ఒప్పందాలకు కొనసాగింపు మాత్రమేనని భారత అధికారులు స్పష్టం చేస్తున్నారు. అమెరికా ఆంక్షల వల్ల రక్షణ సరఫరాలకు ఎలాంటి ఆటంకాలు ఎదురవుతాయని తాము భావించడం లేదని ఉన్నతాధికారులు ధీమా వ్యక్తం చేశారు. దేశ రక్షణ విషయంలో ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా రష్యా నుంచి అధునాతన యుద్ధ పరికరాల సేకరణను భారత్ విజయవంతంగా కొనసాగిస్తోంది.

# ఇలాగైతే విమానాలను నడపలేం




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** విమాన ఇంధన ధరల పెరుగుదలపై ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్(ఎఫ్ఐఏ) ఆందోళన వ్యక్తం చేసింది. విమాన ఇంధన ధరల్ని అదుపులోకి తెచ్చేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ మేరకు కేంద్ర విమానయాన శాఖకు మంగళవారం లేఖ రాసింది. కేంద్రం జోక్యం చేసుకుని విమాన ఇంధన ధరలు తగ్గించకుంటే విమానయానాన్ని కొంతకాలం మూసివేయాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఎఫ్ఐఏ సంస్థ ఇండిగో ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్ వంటి సంస్థలకు ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. తాజాగా ఆయా సంస్థల తరఫున కేంద్రానికి లేఖ రాసింది. ఎఫ్ఐఏ ప్రకారం.. ప్రస్తుతం అంతర్జాతీయ పరిణామాల వల్ల విమాన ఇంధన ధరలు (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్/ఏటీఎఫ్ ) భారీగా పెరిగాయి. దీంతో విమానయాన సంస్థలపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. విమాన ఇంధన ధరల పెరుగుదల వల్ల విమానాల నిర్వహణ కష్టమైపోతోంది. ఏటీఎఫ్ ధరలు చమురు సంస్థలకు అందుబాటులో లేకుండా పెరిగాయి. ఒక కిలోలీటర్ చమురుకు దాదాపు రూ. 2 లక్షల వరకు ఖర్చవుతోంది. పశ్చిమాసియాలో క్రూడాయిల్ ధరలు పెరగడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. సాధారణంగా ఎయిర్ లైన్స్ సంస్థల వ్యయంలో 30,40 శాతం ఇంధనానికి ఖర్చవుతుంది. కానీ, ప్రస్తుతం పరిస్థితుల్లో ధరల పెరుగుదలవల్ల ఈ ఖర్చు 55,60 శాతం పెరిగింది.

## విమాన ఇంధన ధరలను అదుపు చేయండి

- వెంటనే కేంద్రం జోక్యం చేసుకోవాలి
- కేంద్ర విమానయాన శాఖకు ఎఫ్ఐఏ లేఖ

అందుకే కేంద్రం త్వరగా జోక్యం చేసుకుని ధరలు తగ్గించాలని ఎఫ్ఐఏ కేంద్రాన్ని కోరుతోంది. ఏటీఎఫ్ పై ప్రస్తుతం విధిస్తున్న 11 శాతం పన్నును తగ్గించాలని, అలాగే, రాష్ట్రాలు విధించే వ్యాట్ కూడా తొలగించాలనిల కేంద్రాన్ని కోరుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో 25 శాతం వరకు వ్యాట్ ఉన్న సంగతిని ఎఫ్ఐఏ ప్రస్తావిస్తోంది. అలాగే, ఇంధన ధరల్లో స్థిరత్వం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాయి. ధరల స్థిరీకరణకు ఒక ప్రత్యేక వ్యవస్థ ఉండాలని ఎఫ్ఐఏ కోరుతోంది. ఇంధన ధరల పెరుగుదల వల్ల అనేక మార్గాల్లో విమానాలు నడపడం ఆయా సంస్థలకు భారంగా మారుతోంది. అంతేకాదు.. కొన్ని రూట్లలో విమాన సర్వీసుల్ని తగ్గించడం, రద్దు చేయడం చేస్తున్నాయి. ఫ్యుయల్ ధరలు పెరిగితే, అంతిమంగా విమాన టిక్కెట్ల ధరలు పెరుగుతాయి.



# హనుమాన్ భక్తితోనే సమాజంలో మార్పు!

## సిద్దిపేటలో హనుమత్సిద్ధి మహాయజ్ఞం ప్రారంభం



- 75 గంటల పాటు అఖండ చాలీసా పారాయణం
- శ్రీ శ్రీ శ్రీ దుర్గా ప్రసాద్ స్వామి

జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి

సిద్ది పేట మహానగరంలో భక్తి శ్రద్ధల నడుమ "భవిష్యత్ బ్రహ్మ హనుమత్సిద్ధి మహాయజ్ఞం" ఘనంగా ప్రారంభమైంది. స్థానిక డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో ఏప్రిల్ 29 బుధవారం నుండి మే 2 శనివారం వరకు ఈ వేడుకలు కొనసాగనున్నాయి. అఖిల భారత హనుమద్దీక్ష పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ దుర్గా ప్రసాద్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ మహాయజ్ఞంలో భాగంగా 75 గంటల పాటు నిరంతరంగా అఖండ హనుమాన్ చాలీసా పారాయణం, సంకీర్తనలు నిర్వహిస్తున్నారు. రాత్రింబవళ్లు సాగనున్న ఈ కార్యక్రమంలో ప్రత్యేక మూలమంత్రాలు, దీక్షామంత్రాలు, సుందరకాండ పారాయణం, మన్యుసూక్త హవనాలు ఉంటాయి. మే 2న శనివారం సాయంత్రం 6 గంటల నుండి ఒకే ఆసనంలో లక్ష హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టడం ఈ యజ్ఞంలో ప్రధాన ఘట్టం.

### శాంతికి మార్గం

స్వామిజీ మాట్లాడుతూ దేశ శాంతి, భద్రత, మానవ పరివర్తన కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలు అవసరమని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, గాంధీ, సుభాష్ చంద్రబోస్ వంటి మహనీయుల స్ఫూర్తితో.. హనుమాన్ భక్తి ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతి కైలాసం, కూర శ్రీనివాస్, నవీన్ కుమార్, బచ్చు రమేష్, గ్యాదరి పరమేశ్వర్, సత్యం గౌడ్, చొప్పదండి రాము, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. అఖిల భారత తరపున నిర్వహిస్తున్న ఈ మహాయజ్ఞానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.





# క్రీస్తు వెలుగులో చిన్నారులు ఎదగాలి!

- డోర్నకల్ క్యాతెడ్రల్ చర్చిలో విరామ బైబిల్ పాఠశాల
- మే 5 వరకు విద్యార్థులకు ఆధ్యాత్మిక శిక్షణ



**డోర్నకల్, ఏప్రిల్ 28 (జనం పవర్):** డోర్నకల్ లోని చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా డయోసీస్ క్యాతెడ్రల్ చర్చిలో విరామ బైబిల్ పాఠశాల (వీబీఎస్) తరగతులు ఘనంగా జరుగుతున్నాయి. ఈ శిక్షణలో భాగంగా బాలురు, బాలికలు, యువతీ యువకులను జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా విభజించి ఆధ్యాత్మిక బోధనలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్ 25న ప్రారంభమైన ఈ తరగతులు మే 5వ తేదీ వరకు కొనసాగుతాయని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రైస్తవ విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

### ఆధ్యాత్మిక ఎదుగుదలే లక్ష్యం

చిన్నారులు ప్రార్థన చేయడం నేర్చుకోవడంతో పాటు క్రీస్తు వెలుగులో ఎదగడానికి ఈ పాఠశాల ఒక వేదిక అని నిర్వాహకులు పేర్కొన్నారు. భగవంతుని వాక్యాన్ని స్వీకరించేలా చిన్నారుల హృదయాలను సిద్ధం చేయడం ఆశీర్వాదకరమని చెప్పారు. ప్రార్థనలో వారు చేతులు జోడించి దైవచింతనలో పాల్గొనడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. శిక్షణకు హాజరవుతున్న వారికి ప్రత్యేకంగా ఆధ్యాత్మిక తరగతులు నిర్వహిస్తూ క్రైస్తవ సంస్కృతిపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

# ప్రజల ఆరోగ్యానికి అండగా ఉంటాం!

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి, ఏప్రిల్ 28 (జనం పవర్):** సదాశివపేట మండలం సూరారం గ్రామానికి చెందిన అదీన్ ఫర్హాన్, మహమ్మద్ అయాన్ అతీఫ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరి వైద్య ఖర్చుల నిమిత్తం సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కృషితో మొత్తం ఒక లక్షా 60 వేల రూపాయల ఎల్‌ఓసీ మంజూరైంది. ఇందులో అదీన్ ఫర్హాన్‌కు 85 వేలు, అయాన్ అతీఫ్‌కు 75 వేల రూపాయల సాయం అందింది. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు బాధిత కుటుంబ సభ్యులను కలిసి ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం ముందుంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఆసుపత్రి ఖర్చుల భారం తగ్గించేందుకు ఎల్‌ఓసీ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ భరోసా ఇచ్చారు. నిరుపేద కుటుంబాలు వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే ఈ నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# క్రిశాంక్ అరెస్టు కక్షసాధింపే

## మాజీ మంత్రి హరీశ్ రావు



**సంగారెడ్డి, ఏప్రిల్ 28 (జనం పవర్):** బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ అరెస్టు కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యేనని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా కంది సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న క్రిశాంక్‌ను.. ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావులతో కలిసి ఆయన సోమవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఫేక్ పోస్టులు పెట్టిన వారిపై ఆధారాలతో ఫిర్యాదు చేసిన క్రిశాంక్‌ను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. తప్పు చేసిన వారిని వదిలేసి.. ఫిర్యాదు చేసిన వ్యక్తినే జైలుకు పంపడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులను అక్రమ కేసులు, సిట్ లతో అణచివేసే ప్రయత్నం జరుగుతోందని హరీశ్ రావు మండిపడ్డారు. బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను తీసుకొచ్చి.. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కూర్చోబెట్టి బీఆర్ఎస్ నేతల ఫోన్లు, సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. దీనిపై తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని తెలిపారు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఐపీఎస్ అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టబోమని.. వారు పదవీ విరమణ చేసినా సరే విచారణ జరిపిస్తామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాసంగి సన్నవడ్లకు బోనస్ ఇస్తారా లేదా అనే విషయాన్ని ముఖ్యమంత్రి వెంటనే స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. క్రిశాంక్‌పై నమోదు చేసిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని.. పీటీ వారెంట్ల పేరుతో వేధింపులకు పాల్పడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. నియంతలా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి తీరును ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# అర్హులైన నిరుపేదలకే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు!

## రాజీవ్ నగర్‌లో పనులను పరిశీలించిన మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

## గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశం

వేల్పుల నాగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో



అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే రెండు పడక గదుల ఇళ్లు అందజేస్తామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్‌లో ఉన్న గృహ సముదాయాలను అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిరుపేదలకు సొంత గూడు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ పథకం ద్వారా నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. నిర్మాణ దశలో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్న ఇళ్లకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ఎక్కడా జాప్యం జరగకుండా పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఖాకీలకు డీజీపీ శివధర్ రెడ్డి తీపి కబురు

## పుట్టినరోజు, పెళ్లిరోజున పోలీసులకు సెలవు

తుడుం జితేందర్ జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో

తెలంగాణ పోలీసు శాఖలో రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి కొత్త శకానికి నాంది పలికారు. రాత్రింబవళ్లు విధుల్లో ఉంటూ కుటుంబాలకు దూరంగా గడుపుతున్న పోలీసు సిబ్బందికి ఆయన తీపి కబురు అందించారు. ఇకపై ప్రతి పోలీసు ఉద్యోగి తన పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం రోజున విధులకు హాజరు కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ రెండు కీలక సందర్భాల్లో వారికి ప్రత్యేక సెలవు మంజూరు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిరంతరం శాంతిభద్రతలు, నేర పరిశోధన, బందోబస్తు విధులతో సతమతమయ్యే పోలీసులు తమ వ్యక్తిగత జీవితాన్ని విస్మరిస్తున్నారనే అభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలో సిబ్బంది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం కోసం డీజీపీ ఈ నిర్ణయం తీసుకున్నారు. కుటుంబ సభ్యులతో గడపడం వల్ల పోలీసుల్లో పని ఒత్తిడి తగ్గి విధుల్లో మరింత చురుగ్గా పాల్గొంటారని శాఖ భావిస్తోంది. ఈ ఉత్తర్వులు రాష్ట్రంలోని కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు అందరికీ వర్తిస్తాయి. పుట్టినరోజు లేదా వివాహ వార్షికోత్సవం రోజున సిబ్బందికి కచ్చితంగా సెలవు ఇవ్వాలని డీజీపీ ఆదేశించారు. ఇందుకు సంబంధించి పత్రాలను సమర్పించి అధికారులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు మినహా సాధారణ రోజుల్లో యూనిట్ అధికారులు ఈ సెలవులను తిరస్కరించకూడదని స్పష్టం చేశారు. పోలీసులు కూడా సామాజిక జీవులని, వారి ఇంట్లో జరిగే శుభకార్యాల్లో వారు లేకపోవడం వల్ల కలిగే మానసిక వేదన పనితీరుపై ప్రభావం చూపుతుందని డీజీపీ కార్యాలయం పేర్కొంది. మానసిక లోటును భర్తీ చేయడమే తమ లక్ష్యమని డీజీపీ కార్యాలయం ఒక ప్రకటనలో వివరించింది. ఈ నిర్ణయంపై పోలీస్ అసోసియేషన్లు, సిబ్బంది కుటుంబ సభ్యులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్ల తర్వాత తమ వారు ఇంట్లో వేడుకలకు అందుబాటులో ఉండబోతుండటం పట్ల కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. విప్లవాత్మకమైన ఈ మార్పు సిబ్బందిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని పోలీస్ శాఖ భావిస్తోంది.



# స్వదేశాలకు వెళ్లే వరకు భద్రత!

**జోగిపేట ట్రాన్సిట్ హోంను పరిశీలించిన ఎస్పీ**

**వసతి, సౌకర్యాలపై అధికారులకు దిశానిర్దేశం**



**సంగారెడ్డి, ఏప్రిల్ 28 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా జోగిపేట సబ్‌జైలులో ఏర్పాటు చేసిన ట్రాన్సిట్ హోం (విదేశీయుల కేంద్రం)ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం సందర్శించారు. అక్కడ ఉన్న విదేశీయుల వసతి, భద్రత, అందిస్తున్న సౌకర్యాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పాస్‌పోర్ట్ గడువు ముగియడం వంటి కారణాలతో ఇక్కడ ఉన్న విదేశీయులను వారి స్వదేశాలకు పంపించే వరకు భద్రతతో ఉంచుతున్నామని తెలిపారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో 12 మంది విదేశీయులు ఉన్నారని వెల్లడించారు. విదేశీయులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఎస్పీ సూచించారు. నిబంధనలకు అనుగుణంగా వారికి సంరక్షణ అందించాలని ట్రాన్సిట్ హోం అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. ఈ కేంద్రం నిర్వహణ తీరును నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోగిపేట సీఐ అనిల్ కుమార్, ఎస్ఐ పాండు, జైలు సిబ్బంది పాల్గొన్నారు. అధికారుల పనితీరును పరిశీలించిన అనంతరం ఎస్పీ పలు కీలక సూచనలు చేశారు.

# హరిదాస్‌పూర్‌లో నేడు 'రైతు ముంగిటిలో శాస్త్రవేత్తలు'!



**కొండాపూర్, ఏప్రిల్ 28 (జనం పవర్):** కొండాపూర్ మండలం హరిదాస్‌పూర్ గ్రామంలో రైతులకు ఖరీఫ్ సీజన్‌పై అవగాహన కల్పించేందుకు 'రైతు ముంగిటిలో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నేడు నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 8:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులు అనుసరించాల్సిన ఆధునిక సాగు విధానాల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇందులో వివరించనున్నారు. పంటల ఎంపిక, సాగునీటి వినియోగం వంటి పలు కీలక అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు మార్గనిర్దేశం చేస్తారు. అవసరానికి అనుగుణంగా రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం, పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలపై సమగ్రంగా చర్చిస్తారు. మార్కెట్లో అధిక గిరాకీ ఉన్న రకాల ఎంపిక, సేంద్రియ వ్యవసాయం వంటి విషయాలపై అవగాహన కల్పిస్తారు. సాగు ఖర్చులు తగ్గించుకుంటూ లాభసాటి దిగుబడులు సాధించే మెళకువలను రైతులకు నేర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సదస్సును విజయవంతం చేయాలని ఆత్మ కమిటీ చైర్మన్ ఎల్లకొండ ప్రభు కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తే ఉక్కుపాదమే!

**ఏడు ట్రిప్పుల ఇసుకతో పాటు ట్రాక్టర్ స్వాధీనం**

**బెజ్జంకి, ఏప్రిల్ 28 (జనం పవర్):** బెజ్జంకి మండలంలోని మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రవాణాదారులపై టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఏడు ట్రిప్పుల ఇసుకతో పాటు ఒక ట్రాక్టరును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బోయిని సౌజన్య వెల్లడించారు. ప్రభుత్వ సంపదను అక్రమంగా తరలిస్తూ ఆదాయానికి గండికొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. మండలంలోని గాగిల్లాపూర్ శివారులో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. అనుమానాస్పదంగా కనిపిస్తున్న ట్రాక్టరును ఆపి తనిఖీ చేశారు. చిలాపూర్ గ్రామానికి చెందిన బోట్ల ప్రవీణ్ ఎలాంటి అనుమతులు లేకుండా మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవరును విచారించగా ప్రభుత్వ అనుమతి లేదని అంగీకరించడంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు స్థానిక అధికారులకు సమాచారం అందించారు. దాచారం గ్రామ సమీపంలో నిల్వ ఉంచిన ఏడు ట్రిప్పుల ఇసుకను పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. ఇసుక రవాణాకు వాడుతున్న ట్రాక్టరును కూడా సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషనుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సౌజన్య తెలిపారు. మండల పరిధిలో ఎక్కడైనా అక్రమ కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆమె కోరారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.









# మానవత్వమే నిజమైన పురోగతి!

- **ఐఐటీ హైదరాబాద్ 18వ స్థాపన దినోత్సవం**
- **సాంకేతికత మానవ సేవకే కావాలి**
- **డాక్టర్ ప్రకాష్ బాబా ఆమ్టే**



**సంగారెడ్డి, ఏప్రిల్ 28 (జనం పవర్):** సమాజ సంక్షేమం, స్థిరమైన అభివృద్ధి, మానవ సేవలే నిజమైన పురోగతికి ప్రమాణాలని ప్రముఖ మానవతావాది డాక్టర్ ప్రకాష్ బాబా ఆమ్టే పేర్కొన్నారు. భారతీయ సాంకేతిక విద్యాసంస్థ హైదరాబాద్ (ఐఐటీ హైదరాబాద్) 18వ స్థాపన దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కంది క్యాంపస్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐఐటీ హైదరాబాద్ తక్కువ కాలంలోనే సాధించిన విశేష ప్రగతిని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు.

**సాంకేతికత - మానవత్వం**

సాంకేతికతను మానవ సేవకు వినియోగించే దిశగా సంస్థ అడుగులు వేయడం అభినందనీయమని ఆమ్టే పేర్కొన్నారు. 6జీ, స్వయంచాలక వ్యవస్థలు వంటి ఆధునిక రంగాల్లో ఐఐటీ హైదరాబాద్ చేస్తున్న కృషి గొప్పదన్నారు. ప్రకృతితో విద్యార్థుల అనుబంధాన్ని పెంపొందించడం స్ఫూర్తిదాయకమని చెప్పారు. మానవ సేవే ప్రతి అభివృద్ధికి కేంద్రబిందువుగా ఉండాలని.. అప్పుడే అది నిజమైన పురోగతి అని ఆయన స్పష్టం చేశారు.

**పరిశోధనలే లక్ష్యం**

ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ.. 18 ఏళ్ల ప్రయాణంలో తమ సంస్థ అగ్రశ్రేణి విద్యాసంస్థగా ఎదిగిందని చెప్పారు. డీప్ టెక్ పరిశోధన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ప్రతిభను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని వివరించారు. దేశాభివృద్ధికి దోహదపడే ఆవిష్కరణలను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. పరిశోధన, ఆవిష్కరణ, విద్యను సమన్వయం చేస్తూ ప్రపంచ స్థాయి కేంద్రంగా సంస్థ ముందుకు సాగుతోందని తెలిపారు.

**పురస్కారాల ప్రదానం**

వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఈ సందర్భంగా పురస్కారాలు అందజేశారు. మొత్తం 218 అవార్డులను అతిథులు ప్రదానం చేశారు. దాతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎండౌమెంట్ అవార్డులను కూడా విద్యార్థులకు అందజేశారు. ఈ వేడుకల్లో విద్యాసంస్థకు చెందిన పలువురు ప్రముఖులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**వేగంగా అభివృద్ధి**

2008లో ప్రారంభమైన ఐఐటీ హైదరాబాద్.. కృత్రిమ మేధస్సు, స్మార్ట్ మొబిలిటీ, ఆరోగ్య సాంకేతికత వంటి రంగాల్లో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ప్రస్తుతం 340 కి పైగా అధ్యాపకులు, 5,700 కి పైగా విద్యార్థులతో దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న విద్యాసంస్థలలో ఒకటిగా నిలిచింది. మానవాళి కోసం సాంకేతికతలో ఆవిష్కరణ అనే లక్ష్యంతో సంస్థ మరింత ముందుకు సాగుతోందని అధికారులు వివరించారు.



# ఆటలతోనే పని ఒత్తిడి నుంచి ఉపశమనం!

- **మేడే క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల అందజేత**
- **విన్నర్‌గా తోషిబా, రన్నర్‌గా సినర్జీ జట్లు**

**పటాన్‌చెరు, ఏప్రిల్ 28 (జనం పవర్):** క్రీడలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని సంగారెడ్డి జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్ (డీసీఎల్) రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే శ్రామికోత్సవాల సందర్భంగా పాశమైలారం పారిశ్రామిక వాడలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిత్యం విధుల్లో మునిగిపోయే కార్మికులు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఆటలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. ఇటువంటి క్రీడోత్సవాలు నిర్వహిస్తున్న సీఐటీయూ కార్మిక సంఘాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**శ్రామికుల శ్రమనే సంపద**

సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పని హక్కు కోసం కార్మికులు పోరాడి సాధించిన రోజే మేడే అని గుర్తు చేశారు. దేశ నిర్మాణంలో శ్రామికుల శ్రమ కీలక పాత్ర పోషిస్తుందని, శ్రమ సంస్కృతిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులు, భద్రత, సంక్షేమం కోసం తమ సంఘం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. మేడే సందర్భంగా కార్మికులతో పాటు వారి పిల్లలకు కూడా వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

**ఘనంగా ముగింపు వేడుకలు**

ఈ క్రికెట్ టోర్నమెంట్ లో తోషిబా టీం విన్నర్‌గా, సినర్జీ టీం రన్నర్‌గా నిలిచాయి. పాశమైలారం ఇండస్ట్రియల్ క్లస్టర్‌లో జరుగుతున్న ఈ శ్రామికోత్సవాలకు కార్మికులు భారీగా సహకరించాలని నిర్వాహక కమిటీ కన్వీనర్ వీఎస్ రాజు కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు శ్రీనివాస్, లక్ష్మణ్, శ్యామ్, శ్యామ్ సుందర్, మహేశ్వర్ రెడ్డి, రాజిరెడ్డి, సోమన్న, జైపాల్, సుధాకర్, గోపాల్, భూమేష్, ప్రశాంత్, వెంకటేష్, పెద్దిరాజు, సంతోష్ గౌడ్, శేఖర్ రెడ్డి, మదన్ రెడ్డి, దామోదర్, రోషన్, అనంతరావు, శ్రీధర్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రాజు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి


**జిల్లా కలెక్టర్ కె. హైమావతి**



**సిద్దిపేట, ఏప్రిల్ 28 (జనం పవర్):** వచ్చే నెల 3న జరగనున్న నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ఆఫ్‌లైన్ పరీక్షను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని రెండు కేంద్రాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందని వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో మొత్తం 937 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) మార్గదర్శకాల ప్రకారం అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, ఫర్నిచర్ వంటి ఏర్పాట్లను ముందస్తుగా పరిశీలించాలన్నారు. పరీక్ష రోజుల్లో ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు.. విద్యార్థుల రాకపోకలకు వీలుగా అదనపు ఆర్టీసీ బస్సులు నడపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పరీక్షా పత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుంచి కేంద్రాలకు ఎస్కార్ట్‌తో తరలించాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ పర్యవేక్షణలో రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. విద్యార్థులు తప్పనిసరిగా అలాట్‌మెంట్ కార్డు, ఒరిజినల్ ఐడీ, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు మాత్రమే వెంట తెచ్చుకోవాలని కలెక్టర్ సూచించారు. నిబంధనల ప్రకారం నిషేధిత వస్తువులను కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, డీఆర్ఓ నాగరాజమ్మ, ఏఓ రాజ్‌కుమార్, కేవీ ప్రిన్సిపల్ సూర్య ప్రకాష్, నవోదయ పాఠశాల ప్రిన్సిపల్ రాజేందర్ పాల్గొన్నారు.

జనం పవర్
JANAM POWER





# కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ వెన్నెముక!

- నాంపల్లిలో ఘనంగా సేవాదళ్ శిక్షణా శిబిరం
- పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పీసీసీ అధ్యక్షుడి పిలుపు

**సంగారెడ్డి, ఏప్రిల్ 28 (జనం పవర్):** కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన సేవాదళ్ ఆధ్వర్యంలో మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో 'సమర్థ శిక్షణ శిబిరం' ఘనంగా నిర్వహించారు. పార్టీ క్రమశిక్షణను కాపాడుతూ ప్రజా సేవే లక్ష్యంగా కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ శిబిరంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సేవాదళ్ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పార్టీ



విధివిధానాలు, క్రమశిక్షణ, సేవా దృక్పథంపై ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కోవడానికి సంస్థాగత బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ శిక్షణా శిబిరంలో సుదీర్ఘంగా చర్చించారు.

### సేవా దృక్పథం

నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ వెన్నెముక వంటిదని అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సేవాదళ్ కార్యకర్తలు అద్భుతమైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. క్షేత్రస్థాయిలో నాయకత్వ లక్షణాలను ఎలా పెంపొందించుకోవాలనే అంశంపై ఈ శిబిరంలో వక్తలు దిశానిర్దేశం చేశారు. క్రమశిక్షణతో కూడిన సేవే పార్టీకి అసలైన బలమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులతో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వందలాది మంది సేవాదళ్ కార్యకర్తలతో ఎగ్జిబిషన్ మైదానం సందడిగా మారింది. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని నేతలు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సామాన్యులకు వివరించడంలో సేవాదళ్ సైన్యంలా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# పిటిషన్ అందిన రోజే పరిష్కారం






## పోలీస్ స్టేషన్ రూపురేఖలు మార్చిన జన్నారం ఎస్ఐ జి. ఉదయ్ కిరణ్

### పెండింగ్ అనే మాటే లేని పాలనపై సర్వత్రా ప్రశంసలు

తుడుం జితేందర్ జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో

మంచిర్యాల జిల్లా జన్నారం మండల పోలీస్ స్టేషన్ పనితీరులో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ప్రస్తుత సబ్ ఇన్‌స్పెక్టర్ జి. ఉదయ్ కిరణ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ప్రజలకు పోలీస్ సేవలపై కొత్త నమ్మకం కలిగింది. గతంలో నెలకొన్న జాప్యానికి స్వస్తి పలుకుతూ ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతున్నారు. సమర్థవంతమైన అధికారి ఉంటే వ్యవస్థ ఎలా మారుతుందో చెప్పడానికి జన్నారం పోలీస్ స్టేషన్ పనితీరే నిదర్శనంగా నిలుస్తోంది.

### తక్షణ నిర్ణయం

మండల పరిధిలోని 29 గ్రామ పంచాయతీల నుండి వచ్చే ప్రతి పిటిషన్ పట్ల ఎస్ఐ ఉదయ్ కిరణ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఏ రోజు అందిన ఫిర్యాదును ఆ రోజే పరిష్కరిస్తూ బాధితులకు ఊరట కలిగిస్తున్నారు. సమస్య తీవ్రతను బట్టి తక్షణమే స్పందిస్తూ క్షేత్రస్థాయి విచారణ చేపడుతున్నారు. నిరంతర పర్యవేక్షణతో పనుల్లో వేగం పెంచడమే కాకుండా శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడకుండా విధులను నిర్వహిస్తున్నారు.

### ప్రదక్షిణలకు చెక్

గతంలో చిన్న సమస్యకైనా ప్రజలు రోజుల తరబడి స్టేషన్ చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఫిర్యాదు అందిన వెంటనే బాధితులకు భరోసా కల్పిస్తూ సమస్య మూలాలను అన్వేషించి పరిష్కరిస్తున్నారు. దీనివల్ల ప్రజల సమయం వృధా కాకుండా సకాలంలో న్యాయం జరుగుతోంది. పోలీస్ స్టేషన్ ఆవరణ బాధితులతో కిక్కిరిసిపోయే రోజులకు చెక్ పెడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ఆయన ప్రాణం పోస్తున్నారు.

### మండల ప్రజల హర్షం

ప్రజల కష్టాలను గుర్తించి వేగంగా స్పందిస్తున్న ఎస్ఐ తీరుపై మండలంలో ప్రశంసల జల్లు కురుస్తోంది. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే సమస్యను పరిష్కరించే దిశగా ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని స్థానికులు కొనియాడుతున్నారు. వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు ఆయన పనితీరును అభినందిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం శాంతిభద్రతల కోసం శ్రమిస్తున్న ఆయన తీరుతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# ఎండ తీవ్రతలో కూలీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి!

### పాలమాకులలో ఉపాధి కూలీలకు అల్పాహారం, మజ్జిగ పంపిణీ



జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి

సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూర్ మండలం పాలమాకుల గ్రామంలో ఎండ తీవ్రత పెరిగిన నేపథ్యంలో.. ఉపాధి హామీ కూలీలకు యువ నాయకుడు ఆసర్ల రాజు యాదవ్ టిఫిన్ బాక్స్‌లు, వాటర్ బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున కూలీలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నిత్యం శ్రమించే శ్రామికులకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. కూలీలు తరచూ నీరు తాగుతూ ఎండలో ఎక్కువసేపు పని చేసే సమయంలో తగిన విరామాలు తీసుకోవాలని రాజు యాదవ్ కోరారు. మానవత్వంతో ముందుకు వచ్చి కూలీలకు అవసరమైన సామగ్రిని అందించడం ద్వారా ఆయన తన సేవా భావాన్ని చాటుకున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. కూలీలకు ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసర్ల శ్రీనివాస్, బండి శ్రీనివాస్, వరదోలు మల్లేశం, వరదోలు సాగర్, వరదోలు తిరుపతి, మ్యాదరబోయిన వంశీ, ఫీల్డ్ అసిస్టెంట్ శీను, పెర్కా నవీన్ కుమార్, ఏటి రంజిత్ కుమార్, రాజేష్ పాల్గొన్నారు. కూలీల ఇబ్బందులను గుర్తించి సాయం అందించిన రాజు యాదవ్‌ను గ్రామస్థులు, కూలీలు అభినందించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకూడదు!

### తోటపల్లి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన డీసీఓ

### రైతులు ధాన్యం ఆరబెట్టి తీసుకురావాలని సూచన



**బెజ్జంకి, ఏప్రిల్ 28 (జనం పవర్):** బెజ్జంకి మండలంలోని తోటపల్లి గ్రామంలో గల పీఏసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సిద్దిపేట డీసీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### వసతుల కల్పన

కేంద్రానికి వచ్చే రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధాన్యం తూకం వేసే సమయంలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియను పారదర్శకగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

### రైతులకు సూచనలు

కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చే రైతులు పూర్తిస్థాయిలో ఆరబెట్టి తీసుకురావాలని డీసీఓ సూచించారు. తేమ శాతం నిబంధనల మేరకు ఉంటేనే మద్దతు ధర లభిస్తుందని వివరించారు. ఎక్కడా దళారుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా కేంద్రాల్లోనే తమ ఉత్పత్తులను విక్రయించుకోవాలని కోరారు. ఈ తనిఖీలో బెజ్జంకి తహసీల్దార్ శ్రీకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు..

**ఆలేరు, ఏప్రిల్ 28 (జనం పవర్):** హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్తున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంగళవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘటన జరిగింది. ఎస్ 5 బోగీలో అకస్మాత్తుగా మంటలు రావడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఒక బోగీ నుంచి దట్టమైన పొగలు రావడం గమనించిన ప్రయాణికులు వెంటనే అప్రమత్తమై రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. పొగలు రావడం గమనించిన వెంటనే రైల్వే సిబ్బంది రైలును ఆపి అగ్నిమాపక చర్యలు చేపట్టారు. మంటలు ఇతర బోగీలకు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ క్రమంలో ప్రయాణికులు భయాందోళనతో రైలు నుంచి కిందకు దిగి పరుగులు తీశారు. సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రయాణికులకు ధైర్యం చెప్పారు

ప్రాథమిక సమాచారం ప్రకారం షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో పెను ముప్పు తప్పినట్లయింది. ప్రమాదం వల్ల రైలును కొంతసేపు నిలిపివేయడంతో ఇతర రైళ్ల రాకపోకలకు స్వల్ప అంతరాయం కలిగింది. పరిస్థితి చక్కబడిన తర్వాత రైలు తిరిగి ప్రయాణాన్ని ప్రారంభించింది.

# తెలంగాణకు ప్రత్యేక ఆకర్షణగా మహానంది విగ్రహం!

**680 టన్నుల బరువుతో ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహం**

**వేద మంత్రోచ్చారణల మధ్య శిల ఎంపిక, ప్రత్యేక పూజలు**




**సంగారెడ్డి, ఏప్రిల్ 28 (జనం పవర్):** సంగారెడ్డి నియోజకవర్గం ఫసల్‌వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ మహామేరు దేవాలయం గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపుదిద్దుకుంటోంది. ఈ ఆలయంలో ప్రతిష్ఠించబోయే ప్రపంచంలోనే ఎత్తైన మహానంది విగ్రహ నిర్మాణానికి తొలి అడుగు పడింది. 680 టన్నుల బరువుతో తయారయ్యే ఈ విగ్రహానికి కావాల్సిన శిల ఎంపిక కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ ఈ ప్రత్యేక పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

### వేద మంత్రోచ్చారణలు

ఎర్దనూర్ పరిధిలోని క్వారీలో ప్రముఖ జ్యోతిష్య, వాస్తు పండితులు డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వేద మంత్రోచ్చారణల మధ్య శిలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి విగ్రహ నిర్మాణానికి శుభారంభం పలికారు. ఈ మహా నిర్మాణం పూర్తయితే భవిష్యత్తులో ఈ ప్రాంతం ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు.

### రాష్ట్రానికే ఆకర్షణ

నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా నిర్మించనున్న ఈ మహానంది విగ్రహం తెలంగాణకే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని కొనియాడారు. ఆధ్యాత్మికత, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ నిర్మాణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. ఇంతటి గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. భక్తి భావం పెంపొందించే ఇటువంటి నిర్మాణాలు సమాజానికి ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నంది విగ్రహం రూపకల్పన, దాని విశిష్టత గురించి సిద్ధాంతి భక్తులకు వివరించారు. శిల ఎంపిక జరిగిన ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భవిష్యత్తులో ఈ క్షేత్రం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ప్రజల సేవలోనే అసలైన సంతోషం

- సురేఖ ప్రేమ్ సాగర్ రావు 40వ వివాహ వార్షికోత్సవం
- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదాన కార్యక్రమం





**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల ఎమ్మెల్యే దంపతులు కొక్కిరాల సురేఖ, ప్రేమ్ సాగర్ రావుల 40వ వివాహ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమం చేపట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

### నిరుపేదలకు అన్నదానం

ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఈ అన్నదాన కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా నిరుపేదల ఆకలి తీర్చడం సంతోషకరమని మేయర్ ధర్ని మధుకర్ పేర్కొన్నారు. సురేఖ ప్రేమ్ సాగర్ రావు దంపతులు ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోరుకుంటారని.. వారి అడుగుజాడల్లోనే తాము ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు.

### ఘనంగా శుభాకాంక్షలు

ఆ భగవంతుని ఆశీస్సులతో సురేఖ ప్రేమ్ సాగర్ రావు దంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని నాయకులు ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో వారు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



# ప్రజల అవస్థలు గ్రహించి రోడ్డు పనులు చేపట్టాలి!

- బెజ్జంకి-బేగంపేట రహదారిపై గ్రామస్తుల నిరసన
- అసంపూర్తి పనులతో రెండేళ్లుగా ప్రయాణికుల నరకం
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకటరెడ్డి

**బెజ్జంకి, ఏప్రిల్ 28 (జనం పవర్):** బెజ్జంకి నుండి బేగంపేట వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బేగంపేట నుండి బెజ్జంకి వెళ్లే ఆర్టీసీ బస్సును సుమారు అరగంట పాటు గ్రామస్తులతో కలిసి నిలిపివేసి నిరసన తెలిపారు. రెండు సంవత్సరాలుగా ఈ రహదారి అసంపూర్తిగా ఉన్నప్పటికీ.. ఏ ఒక్క ప్రజాప్రతినిధి పట్టించుకోకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### ఎమ్మెల్యేకు విజ్ఞప్తి

మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వెంటనే స్పందించి బేగంపేట ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని వెంకట్ రెడ్డి కోరారు. పాడైపోయిన రహదారి వల్ల ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారని.. రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

### నిరసన ఉధృతం

రోడ్డు పనులు ప్రారంభించే వరకు తమ పోరాటం ఆపబోమని గ్రామస్తులు స్పష్టం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల సామాన్యులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బేగంపేట గ్రామస్థులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టరేట్ ముట్టడికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు.

# ఉద్యోగుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి!

- మే 5న నిర్వహించే నిరాహార దీక్షను విజయవంతం చేయాలి
- పెండింగ్ డీఏలు, పీఆర్సీ సాధనే లక్ష్యంగా ఉద్యమం
- ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్



**కరీంనగర్, ఏప్రిల్ 28 (జనం పవర్):** తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో మే 5వ తేదీన చేపట్టనున్న ఒక్కరోజు నిరాహార దీక్షను విజయవంతం చేయాలని ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లో భాగస్వామ్య పక్షాలతో జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఉద్యోగి ఈ దీక్షా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసనను తెలియజేయాలని కోరారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం అందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి చేరవేసే ఉద్యోగుల సంక్షేమాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని నేతలు పేర్కొన్నారు. అయితే ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలలకు ఒకసారి ఇవ్వాల్సిన డీఏలు, ఏటా ఇచ్చే ఇంక్రిమెంట్లు, ఐదేళ్లకు ఒకసారి అమలు చేయాల్సిన పీఆర్సీ వంటి అంశాల్లో జాప్యం జరుగుతోందని విమర్శించారు. 2023 జూలై నుండి రావాల్సిన పీఆర్సీ ఇప్పటికీ అమలు కాకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన 5 శాతం మధ్యంతర భృతితోనే ఉద్యోగులను సరిపెడుతున్నారని మండిపడ్డారు.

### బకాయిల పెండింగ్

జీపీఎఫ్ డబ్బులు, సరెండర్ లీవ్ బిల్లులు, టీజీఎల్ఐఎఫ్ ఇన్సూరెన్స్ వంటి వివిధ రకాల బకాయిలు ఏళ్లుగా పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నేతలు తెలిపారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపై ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ధ్వజమెత్తారు. సీపీఎస్ రద్దుపై స్పష్టత లేదని, హెల్త్ కార్డు పథకం అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆసుపత్రులను ఖరారు చేయకపోవడం వల్ల వైద్య సేవల విషయంలో ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### తక్షణ చర్యలు తీసుకోవాలి

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణలో జరుగుతున్న జాప్యంపై కూడా జేఏసీ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులందరూ ఒకే స్వరంతో తమ గళాన్ని వినిపిస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళిచరణ్, ఇన్చార్జి కటకం రమేష్, పేండ్యాల కేశవ రెడ్డి, కోట రామస్వామి, మారుపాక రాజేష్ భరద్వాజ్ పాల్గొన్నారు.




# మెంటర్‌షిప్ సరిగా ఉంటే..

## వైభవ్‌పై మనూ భాకర్ కామెంట్స్.. నెట్టింట చర్చ

**న్యూఢిల్లీ:** యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ గురించి షూటర్ మనూ భాకర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీశాయి. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకుంటున్న వైభవ్ సూర్యవంశీ, భారీ షాట్లు కొడుతూ కీలక ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. ఇటీవల ముగిసిన టీ20 అండర్-19 వరల్డ్‌కప్‌లోనూ అతని ప్రతిభ మరోసారి వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్న మనూ భాకర్‌ను ఓ రిపోర్టర్, వైభవ్ సూర్యవంశీ గురించి అభిప్రాయం అడిగారు. దీనికి స్పందించిన మనూ భాకర్, సరైన మార్గదర్శకత్వం ఉంటే వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, ప్రతిభకు వయసుతో ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. చిన్న వయసులోనైనా, పెద్ద వయసులోనైనా గొప్ప విజయాలు సాధ్యమేనని ఆమె పేర్కొన్నారు. వైభవ్ చుట్టూ ఉన్న వారు సరైన మార్గంలో నడిపిస్తే, అతను భవిష్యత్తులో గొప్ప స్టార్‌గా ఎదుగుతాడని ఆశాభావం వ్యక్తం చేశారు అయితే మనూ భాకర్ చేసిన ఈ వ్యాఖ్యలపై ఆన్‌లైన్‌లో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కోల్‌కతా నైట్ రైడర్స్ మాజీ టీం డైరెక్టర్ జోయ్ భట్టాచార్య ఈ సందర్భంగా స్పందిస్తూ, ఒక ఒలింపిక్ పతక విజేతను క్రికెటర్ గురించి ప్రశ్నించడం సరైన విధానం కాదని విమర్శించారు. ఆమె సాధించిన విజయాలను చిన్నచూపు చూడటంలా ఇది అనిపిస్తుందని అన్నారు. మనూ భాకర్ గురించి వైభవ్ సూర్యవంశీని అడిగితే, అతను ఇచ్చే స్పందన ఎలా ఉంటుందో చూడాలని వ్యాఖ్యానించారు. కొందరు నెటిజన్లు కూడా ఈ ప్రశ్నను తప్పుపట్టారు. వేర్వేరు క్రీడలకు చెందిన క్రీడాకారులను ఇలా పోల్చడం లేదా ఒకరిపై మరొకరి అభిప్రాయం అడగడం అవసరం లేదని అభిప్రాయపడ్డారు.ఇక మనూ భాకర్ క్రీడా ప్రస్థానాన్ని పరిశీలిస్తే, ఆమె 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలను సాధించి చరిత్ర సృష్టించారు. 10 మీటర్ల పిస్తోల్ ఈవెంట్‌లో ఒకటి, 10 మీటర్ల పిస్తోల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మరోటి గెలుచుకుని, ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన భారత క్రీడాకారిణిగా అరుదైన ఘనతను అందుకున్నారు.



# నిజాయితీగా ఉండండి

## విద్యార్థులకు కోహ్లీ సందేశం

**న్యూఢిల్లీ:** విద్యార్థులు నిజాయితీ, నిబద్ధతతో తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ సూచించారు. మంగళవారం న్యూఢిల్లీలోని ఆర్కే పురం పాఠశాలలో నిర్వహించిన క్రికెట్ శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం అందించారు. చదువును గౌరవించాలని, పాఠశాల జీవితం వ్యక్తిత్వ వికాసానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి తన పాఠశాల అనుభవాలను గుర్తు చేసుకున్న కోహ్లీ, క్రికెట్‌ను తన జీవిత లక్ష్యంగా ఎంచుకున్న తర్వాత పాఠశాల వాతావరణానికి చాలా త్వరగా దూరమయ్యానని చెప్పారు. పాఠశాలల్లో మాట్లాడే అలవాటు పెద్దగా లేకపోవడంతో ఇలాంటి వేదికలపై మాట్లాడటం కొంత ఇబ్బందిగా అనిపిస్తుందని వెల్లడించారు. అయితే విద్యార్థులతో తన అనుభవాలను పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల అనేది కేవలం పాఠాలు నేర్చుకునే స్థలం మాత్రమే కాదని, మంచి మనిషిగా ఎదగడానికి బలమైన పునాది అని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఎంతో కష్టపడతారని, వారి సేవలను ఎప్పటికీ మర్చిపోవద్దని సూచించారు. తమ జీవితంలో ఒక భాగాన్ని విద్యార్థుల అభివృద్ధి కోసం అంకితం చేసే ఉపాధ్యాయుల పట్ల ఎల్లప్పుడూ గౌరవభావంతో ఉండాలని కోహ్లీ విద్యార్థులకు సూచించారు.

# విమర్శలే బలం: శ్రేయస్



**న్యూఢిల్లీ:** ఒకప్పుడు కేవలం వన్డే ఫార్మాట్‌కే పరిమితం అవుతాడన్న విమర్శలను చెదరగొడుతూ భారత క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ సారథిగా జట్టును ముందుండి నడిపించడమే కాకుండా, క్రీజులోకి వచ్చేసరికి మ్యాచ్‌ను ముగించే ఫినిషర్‌గా తనలోని కొత్త కోణాన్ని ప్రదర్శిస్తున్నాడు. కష్టకాలంలో ఎదురైన విమర్శలే తనను మరింత దృఢంగా మార్చాయని అయ్యర్ పేర్కొన్నాడు. తన బ్యాటింగ్‌ను మెరుగుపరుచుకునేందుకు అయ్యర్ కఠిన సాధన చేస్తున్నాడు. ప్రతి ప్రాక్టీస్‌లో సుమారు 300 బంతులను ఎదుర్కొంటూ, ఆధునిక క్రికెట్ దిగ్గజాలు అయిన ఏబీ డివిలియర్స్, రోహిత్ శర్మ మరియు విరాట్ కోహ్లీ ల ఆటతీరును అనుసరిస్తున్నట్లు వెల్లడించాడు. మైదానంలో వారి ఏకాగ్రత, షాట్ ఎంపికలను గమనిస్తూ తన ఆటను మరింత మెరుగుపరుచుకున్నానని తెలిపాడు. "గతంలో నాపై వచ్చిన విమర్శలు, అవమానాలను నేను ఇంధనంగా మార్చుకున్నాను. నన్ను నేను నిరూపించుకోవడమే నా లక్ష్యం" అని అయ్యర్ ధీమా వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఆయన, రాబోయే టీ20 ప్రపంచకప్‌లో కూడా తన స్థానాన్ని బలపరుచుకునే దిశగా అడుగులు వేస్తున్నాడు.

# రాజస్థాన్ విక్టరీ!



- పంజాబ్ కింగ్స్‌పై ఆరు వికెట్ల తేడాతో అద్భుత గెలుపు
- 223 పరుగుల భారీ లక్ష్యాన్ని ఊదేసిన బ్యాటర్లు
- అదరగొట్టిన డొనొవన్ ఫెరీరా, యశస్వి జైస్వాల్
- వృథా అయిన స్టొయినిస్, ప్రభ్ సిమ్రన్ వీరోచిత పోరాటం
- పరుగుల వరద పారిన పీసీఏ న్యూ క్రికెట్ స్టేడియం

పీసీఏ న్యూ క్రికెట్ స్టేడియం వేదికగా మంగళవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్ అభిమానులకు పరుగుల పండుగను పంచింది. బౌలర్లను ఊచకోత కోస్తూ బ్యాటర్లు చెలరేగిన ఈ ఉత్కంఠ పోరులో పంజాబ్ కింగ్స్ పై రాజస్థాన్ రాయల్స్ అద్భుత విజయాన్ని అందుకుంది. పంజాబ్ నిర్దేశించిన 223 పరుగుల భారీ లక్ష్యాన్ని రాజస్థాన్ బ్యాటర్లు ఏమాత్రం తడబడకుండా ఛేదించారు. కేవలం 19.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి సగర్వంగా లక్ష్యాన్ని ముద్దాడారు.

### స్టొయినిస్ సునామీ..

అంతకుముందు టాస్ గెలిచిన రాజస్థాన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత ఇరవై ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ ప్రభ్ సిమ్రన్ సింగ్ 44 బంతుల్లో 59 పరుగులతో ఇన్నింగ్స్ కు బలమైన పునాది వేశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన మార్కస్ స్టొయినిస్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. సునామీ ఇన్నింగ్స్ ఆడిన అతడు కేవలం 22 బంతుల్లోనే అజేయంగా 62 పరుగులు చేసి రాజస్థాన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతనికి తోడుగా కూపర్ కొన్నోలీ 14 బంతుల్లో 30 పరుగులతో మెరుపులు మెరిపించాడు. రాజస్థాన్ బౌలర్లలో యశ్ పంజా నాలుగు ఓవర్లలో 41 పరుగులిచ్చి రెండు వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్, నాంద్రె బర్గర్ చెరో వికెట్ పడగొట్టారు.

### లక్ష్యాన్ని కరిగించిన జైస్వాల్, ఫెరీరా..

223 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ కు అదిరిపోయే ఆరంభం దక్కింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ 27 బంతుల్లో 51 పరుగులు చేసి జట్టు స్కోరును పరుగులు పెట్టించాడు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కేవలం 16 బంతుల్లోనే 43 పరుగులు



చేసి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. ఆ తర్వాత డొనొవన్ ఫెరీరా బాధ్యత తీసుకున్నాడు. 26 బంతుల్లో 52 పరుగులతో అజేయంగా నిలిచి మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే రాజస్థాన్ కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. పంజాబ్ బౌలర్లలో యుజ్వేంద్ర చాహల్ నాలుగు ఓవర్లలో 36 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. అర్షదీప్ సింగ్ ఒక వికెట్ దక్కించుకోగా.. హర్ ప్రీత్ బ్రార్ వికెట్లేమీ తీయకుండా 25 పరుగులు ఇచ్చాడు.



# ఐపీఎల్‌పై వార్నర్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 :** ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం డేవిడ్ వార్నర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి టైటిల్ అందించిన వార్నర్, ఇటీవల ఐపీఎల్‌పై చేసిన స్పందన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రస్తుతం పాకిస్థాన్ సూపర్ లీగ్ 2026 సీజన్‌లో కరాచీ కింగ్స్ జట్టుకు నాయకత్వం వహించిన వార్నర్, జట్టు గ్రూప్ దశలోనే నిష్క్రమించడంతో భావోద్వేగపూరిత సందేశం పంచుకున్నాడు. జట్టు కృషిని ప్రశంసిస్తూ, అభిమానులు, నిర్వాహకులు, భద్రతా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్రమంలో ఒక భారతీయ నెటిజన్ చేసిన కామెంట్‌కు వార్నర్ ఇచ్చిన సమాధానం సంచలనంగా మారింది. 'ఐపీఎల్‌కు తిరిగి రావాలి' అన్న సూచనపై "ఇప్పుడు ఆ అవసరం లేదు" అంటూ ఆయన కౌంటర్ ఇచ్చాడు. ఈ స్పందనపై పాకిస్థాన్ అభిమానులు వార్నర్‌ను సమర్థిస్తుండగా, భారత అభిమానులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా వార్నర్ వ్యాఖ్యలు రెండు దేశాల క్రికెట్ అభిమానుల మధ్య చర్చలకు దారితీయగా, సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి.

# వింత నిర్ణయాలు.. జట్లకు నష్టం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నప్పటికీ, కొన్ని జట్ల సారథులు తీసుకుంటున్న వింత నిర్ణయాలు తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నాయి. అనవసర ప్రయోగాలు, కీలక సమయంలో తప్పు వ్యూహాలు అమలు చేయడం వల్ల గెలిచే మ్యాచ్‌లను సైతం చేజార్చుకుంటున్నారు. ముఖ్యంగా ఢిల్లీ, రాజస్థాన్, లక్నో జట్ల పరాజయాలకు సారథుల నిర్ణయాలే కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీ జట్టు విషయంలో తీసుకున్న నిర్ణయాలు ఆశ్చర్యానికి గురిచేశాయి. బలమైన బౌలింగ్‌ను ఎదుర్కొనే సమయంలో అనుభవం లేని యువ ఆటగాడిని ఓపెనర్‌గా పంపడం పెద్ద తప్పిదంగా మారింది. తొలి మ్యాచ్‌లోనే విఫలం కావడంతో జట్టు ఒత్తిడిలో పడిపోయింది. సీనియర్ ఆటగాళ్లను ముందుగా పంపాల్సిందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ తరహా నిర్ణయాల వల్లే జట్టు అగ్రస్థానం నుంచి కిందకు జారిందని చెబుతున్నారు. ఇక రాజస్థాన్ జట్టు పరిస్థితి కూడా భిన్నంగా లేదు. భారీ స్కోరు చేసినప్పటికీ సరైన బౌలింగ్ వ్యూహం లేక ఓటమిని చవిచూసింది. ప్రధాన స్పిన్నర్లను పూర్తిగా వినియోగించకపోవడం, అనవసరంగా ఎక్కువమంది బౌలర్లను ప్రయోగించడం జట్టుకు ప్రతికూలంగా మారింది. కీలక సమయాల్లో అనుభవజ్ఞులైన బౌలర్లపై విశ్వాసం చూపకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. మరోవైపు లక్నో జట్టు సూపర్ ఓవర్‌లో చేసిన తప్పులు జట్టును ముంచేశాయి. ఫామ్‌లో లేని ఆటగాడిని ఓపెనింగ్‌కు పంపడం, కీలక సమయంలో సరైన బౌలర్‌ను ఉపయోగించకపోవడం మ్యాచ్ ఫలితాన్ని మార్చేసింది. ఇలాంటి చిన్న వ్యూహపరమైన పొరపాట్లు కూడా పెద్ద నష్టాన్ని కలిగిస్తాయని ఈ మ్యాచ్ స్పష్టంచేసింది. మొత్తంగా చూస్తే, మైదానంలో ఆటగాళ్ల ప్రతిభ ఎంత ముఖ్యమో, సారథి తీసుకునే నిర్ణయాలు అంతకంటే కీలకం. పరిస్థితులకు అనుగుణంగా సరైన వ్యూహం లేకపోతే ఎంతటి బలమైన జట్టైనా పరాజయం తప్పదని ఈ సీజన్ మరోసారి నిరూపిస్తోంది.

# ప్లేఆఫ్స్ పోరు హోరాహోరీ

- టాప్-4లో పంజాబ్, ఆర్‌సీబీ జోరు!
- అగ్రస్థానంలో పంజాబ్ కింగ్స్.. ఒత్తిడిలో చెన్నై, ఢిల్లీ జట్లు
- ముంబై, కోల్‌కతా ఆశలు ఆవిరి..
- ఉత్కంఠ రేపుతున్న పాయింట్ల పట్టిక

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ లీగ్ దశ సగం ముగియడంతో ప్లేఆఫ్స్ బెర్తుల కోసం పోరాటం క్లైమాక్స్ దశకు చేరుకుంది. ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌ల సరళిని బట్టి చూస్తే పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తమ ఆధిపత్యాన్ని చాటుతూ పాయింట్ల పట్టికలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. సాధారణంగా ప్లేఆఫ్స్ చేరడానికి అవసరమైన 16 పాయింట్ల మార్కును చేరుకోవడంలో ఈ నాలుగు జట్లు ప్రస్తుతం ముందంజలో ఉన్నాయి. ముఖ్యంగా శిఖర్ ధావన్ సేన పంజాబ్ కింగ్స్ ఆడిన 7 మ్యాచ్‌లలో 6 విజయాలతో దాదాపు ఒక అడుగు ప్లేఆఫ్స్‌లో వేసింది. మిగిలిన మ్యాచ్‌లలో మరో రెండు గెలిచినా ఆ జట్టు అధికారికంగా క్వాలిఫై అవుతుంది.





ఆర్‌సీబీ కూడా అదే జోరును కొనసాగిస్తూ ప్లేఆఫ్స్ రేసులో పటిష్టంగా కనిపిస్తోంది.

### హైదరాబాద్, రాజస్థాన్ జట్ల ధీమా

స్థిరత్వానికి మారుపేరుగా నిలుస్తున్న రాజస్థాన్ రాయల్స్ మరియు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు కూడా ప్లేఆఫ్స్ బెర్త్ ఖాయం చేసుకునే దిశగా సాగుతున్నాయి. ఈ రెండు జట్లు మిగిలిన మ్యాచ్‌లలో కనీసం మూడు విజయాలు సాధిస్తే టాప్-4లో తమ స్థానాలను సురక్షితం చేసుకునే అవకాశం ఉంది. హైదరాబాద్ బ్యాటర్లు భీకర ఫామ్‌లో ఉండటం, రాజస్థాన్ బౌలింగ్ విభాగం రాణిస్తుండటం ఆయా జట్లకు కలిసొచ్చే అంశం. అయితే గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మరియు ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు మాత్రం గందరగోళంలో ఉన్నాయి. ప్రతి మ్యాచ్ ఈ జట్లకు చావోరేవో అన్నట్లుగా మారడంతో, లీగ్ రెండో భాగంలో ఈ జట్లు అసాధారణ ప్రదర్శన చేస్తే తప్ప ప్లేఆఫ్స్ చేరడం కష్టంగా కనిపిస్తోంది.

### మాజీ ఛాంపియన్లకు నిరాశేనా?

లీగ్ చరిత్రలో అత్యధిక సార్లు టైటిల్ గెలిచిన ముంబై ఇండియన్స్ మరియు కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లకు ఈ సీజన్ కలిసిరావడం లేదు. పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న ఈ జట్లతో పాటు లక్నో సూపర్ జెయింట్స్ పరిస్థితి కూడా దారుణంగా ఉంది. ముంబై ఇండియన్స్ వరుస ఓటములతో అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. ఈ జట్లు ప్లేఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లోనూ భారీ తేడాతో విజయం సాధించాల్సి ఉంటుంది. ఒకవేళ ఏ ఒక్క మ్యాచ్ ఓడినా ఈ జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించడం ఖాయంగా కనిపిస్తోంది. మొత్తానికి ఐపీఎల్ 2026 సెకండ్ హాఫ్ మరింత ఉత్కంఠగా సాగనుండటంతో ప్రతి బంతి, ప్రతి రన్ ప్లేఆఫ్స్ సమీకరణాలను మార్చేలా ఉన్నాయి.



# పండుగాడి జర్నీకి 20ఏళ్లు

### పోకిరీ విడుదలై రెండు దశాబ్దాలు

తెలుగు చలనచిత్ర చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించి, బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టించిన 'పోకిరి' చిత్రం సరిగ్గా 20 వసంతాలను పూర్తి చేసుకుంది. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం ఇదే రోజున 2006 ఏప్రిల్ 28న విడుదలైన ఈ సినిమా, అప్పటి వరకు ఉన్న తెలుగు సినిమా బాక్సాఫీస్ లెక్కలను పూర్తిగా మార్చివేసింది. ఈ చిత్రం సూపర్ స్టార్ మహేష్ బాబును మాస్ ప్రేక్షకులకు అత్యంత చేరువ చేయడమే కాకుండా, ఆయనను తిరుగులేని పవర్‌హౌస్‌గా నిలబెట్టింది. డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ మార్క్ మేకింగ్, పదునైన సంభాషణలు మరియు మహేష్ బాబు అల్ట్రా మోడ్రన్ లుక్ కలిసి వెండితెరపై ఒక మ్యాజిక్ చేశాయి. దాదాపు రూ.12 కోట్ల పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం, ఏకంగా రూ.66 కోట్లకు పైగా వసూళ్లను సాధించి అప్పట్లో 'ఇండస్ట్రీ హిట్'గా రికార్డు సృష్టించింది. కేవలం వసూళ్ల పరంగానే కాకుండా, సాంకేతికంగానూ ఈ చిత్రం సరికొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ముఖ్యంగా మణిశర్మ అందించిన అద్భుతమైన సంగీతం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రతి థియేటర్లో వైబ్రేషన్స్ పుట్టించాయి. హీరోయిన్ ఇలియానాకు ఈ సినిమా ఓవర్ నైట్ స్టార్‌డమ్ తీసుకురాగా, విలన్‌గా ప్రకాష్ రాజ్ నటన సినిమాకు ప్రాణం పోసింది. సినిమా ప్రథమార్థం అంతా పండుగాడు అనే ఒక సాధారణ లోకల్ రౌడీగా కనిపించిన మహేష్ బాబు, క్లైమాక్స్ వచ్చేసరికి కృష్ణ మనోహర్ అనే అండర్ కవర్ ఐపీఎస్ ఆఫీసర్ అని రివీల్ అయ్యే సీన్ ప్రేక్షకులకు ఊహించని థ్రిల్ ఇచ్చింది. ఈ ఒక్క ట్విస్ట్ అప్పట్లో థియేటర్లలో సంచలనం సృష్టించడమే కాకుండా, సినిమాను మళ్ళీ మళ్ళీ చూసేలా ప్రేక్షకులను ప్రోత్సహించింది. 'ఎవడు కొడితే దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అవుతుందో వాడే పండుగాడు', 'ఒకసారి కమిట్ అయితే నా మాట నేనే విననుʻ వంటి డైలాగులు నేటికీ తెలుగు ప్రేక్షకుల నాలుకలపై నానుతూనే ఉన్నాయి. ఈ సినిమా క్రేజ్ కేవలం టాలీవుడ్‌కే పరిమితం కాకుండా, తమిళంలో విజయ్ హీరోగా, హిందీలో సల్మాన్ ఖాన్ హీరోగా, కన్నడలో దర్శన్ హీరోగా రీమేక్ అయ్యి అక్కడ కూడా ఘనవిజయాలను అందుకుంది. 'పోకిరి' 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహేష్ బాబు అభిమానులు సోషల్ మీడియాలో భారీ ఎత్తున వేడుకలు జరుపుకుంటున్నారు.




# మా ఇంటి బంగారం ప్రమోషన్స్

### ఇంకా మొదలు పెట్టని నటి సమంత

ఈ మధ్య కాలంలో ప్రేక్షకులను మెప్పించడం చాలా కష్టంగా మారింది. ఒకప్పుడు స్టార్ హీరో, స్టార్ హీరోయిన్ సినిమా వస్తోంది అంటే చాలు.. అది ఎలా ఉన్నా కూడా ఫ్యాన్స్ హిట్ చేసేవారు. కానీ, ఇప్పటి జనరేషన్ అలా కాదు. ఎంత పెద్ద స్టార్ అయినా సరే కంటెంట్ ఉంటేనే హిట్ చేస్తున్నారు. కంటెంట్ తో పాటు ప్రమోషన్స్ ని కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు. అందుకే ఈ మధ్య స్టార్ హీరోలు సైతం సరికొత్తగా ప్రచారాలు చేస్తూ తమ సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. అయితే తాజాగా స్టార్ హీరోయిన్ సమంత మాత్రం తన సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్ళలేకపోయారు అని టాక్ నడుస్తోంది. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నటిస్తోన్న తాజా చిత్రం మా ఇంటి బంగారం. నందినిరెడ్డి దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని సామ్ భర్త రాజ్ నిడిమోరు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మే 15 న ఈ చిత్రం రిలీజ్ కు సిద్ధమవుతోంది. రిలీజ్ ఇంకా పట్టుమని 15 రోజులు కూడా లేదు.. కానీ, ఇప్పటివరకు ఈ సినిమా ప్రమోషన్స్ మొదలుపెట్టలేదు. ఒకప్పుడు సామ్ సినిమా రిలీజ్ అంటే ఆ బజ్ వేరే లెవెల్ లో ఉండేది. కానీ, ఇప్పుడు అలా లేదు. రాజ్ నిడిమోరుతో పెళ్ళి తరువాత సామ్ ఒకపక్క నిర్మాతగా.. ఇంకోపక్క హీరోయిన్ గా చేస్తున్న సినిమా మా ఇంటి బంగారం. ఓ బేబీ లాంటి హిట్ తరువాత సామ్- నందినిరెడ్డి కాంబోలోవస్తోన్న చిత్రం కావడంతో ఓ రేంజ్ లో బజ్ ఉంటుంది అనుకున్నారు. అయితే సామ్ మాత్రం ప్రమోషన్స్ చేయడంలో విఫలమయ్యారు అని చెప్పొచ్చు. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి ఒక్క ప్రమోషన్ ఇంటర్వ్యూ తప్ప ఇంకేమి రాలేదు. వెన్నెల కిషోర్ - సామ్ ఇంటర్వ్యూ రిలీజ్ అయినా కూడా అదేమీ అంతగా ఆసక్తి రేకెత్తించలేదు అని టాక్. అందుకనే ప్రేక్షకులు సైతం మా ఇంటి బంగారం సినిమాను పట్టించుకోవడం లేదని అంటున్నారు. మరి ఇప్పటికైనా సామ్ ప్రమోషన్స్ ను వేగవంతం చేసి ప్రేక్షకుల్లో ఆసక్తి కలిగించకపోతే సినిమాపై ఆశలు వదులుకోవాల్సిందే అని పలువురు చెప్పుకొస్తున్నారు.

# అషు రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

పెళ్లి పేరుతో మోసం చేసి ఎన్ఆర్ఐ ధర్మేంద్ర నుంచి భారీగా డబ్బులు తీసుకున్నట్లు నమోదైన కేసులో సినీ నటి అషు రెడ్డికి సంబంధించిన ఆడియో రికార్డింగ్స్ లీక్ కావడం సంచలనంగా మారింది. ఇప్పటికే ఈ వ్యవహారంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. తాజాగా బయటకు వచ్చిన కాల్ రికార్డింగ్స్‌లో ధర్మేంద్రకు డబ్బులు తిరిగి ఇస్తానని చెబుతూ హెచ్చరికలు చేసినట్లు వినిపిస్తున్నట్లు సమాచారం. తాను తీసుకున్న మొత్తంలో కోటిన్నర రూపాయలు మాత్రమే ఇప్పుడే ఇస్తానని, మిగిలిన డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. తన మాట వినకపోతే వేధింపుల కేసులు పెడతానని కూడా హెచ్చరించినట్లు ఆ ఆడియోల్లో వినిపిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా మధ్యవర్తుల ద్వారా రాజీ చేసుకుందామని సూచించిన మాటలు కూడా ఆ రికార్డింగ్స్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ ఆడియోల లీక్‌తో కేసు మరింత చర్చనీయాంశంగా మారగా, పోలీసులు ఈ వ్యవహారాన్ని పలు కోణాల్లో పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.



# లుక్ టెస్ట్ పూర్తయ్యింది

### చిరు -బాబీ కాంబినేషన్‌లో మూవీ

అగ్ర కథానాయకుడు చిరంజీవి ఫుల్ జోష్‌లో ఉన్నారు. వరుస చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతోన్న ఆయన తాజాగా కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించిన లుక్ టెస్ట్‌ను పూర్తి చేశారు. బాబీ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా రెండో సినిమా రానున్న విషయం తెలిసిందే. మెగా 158గా ఇది ప్రచారంలో ఉంది. ఈ సినిమా అప్‌డేట్‌ను దర్శకుడు పంచుకున్నారు. ఈ రోజు లుక్‌టెస్ట్ పూర్తయిందని.. త్వరలోనే షూటింగ్ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చిరు ఫొటోషూట్‌కు సంబంధించిన ఫొటోను షేర్ చేస్తూ 'హింసకు ముందు నిశ్శబ్దం' అనే క్యాప్షన్ రాశారు. దీంతో భారీ స్థాయి యాక్షన్ చిత్రంగా ఇది రానున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి - బాబీ కాంబినేషన్‌లో గతంలో 'వాల్తేరు వీరయ్య' రూపొందింది. 2023లో వచ్చిన ఈ చిత్రం మంచి ఆదరణను సొంతం చేసుకోవడంతో వీరి రెండో సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఈ ఏడాది 'మన శంకర వరప్రసాద్ గారు'తో హిట్ అందుకున్న చిరంజీవి మూడు సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'విశ్వంభర' ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సోషియో ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్‌తో పాటు శ్రీకాంత్ ఓదెల చిత్రం లైనప్‌లో ఉంది.





# మైఖేల్ మూవీ వసూళ్ల సునామీ

దివంగత పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ప్రతిష్టాత్మక బయోపిక్ 'మైఖేల్' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన అతి తక్కువ కాలంలోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రికార్డులను తిరగరాస్తూ అంతర్జాతీయ స్థాయిలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ.2000 కోట్లు మిలియన్ల మార్కుకు చేరువలో ఉండగా, భారత మార్కెట్‌లోనూ మైఖేల్ జాక్సన్‌కు ఉన్న తిరుగులేని క్రేజ్‌ను చాటుతూ రూ.20 కోట్ల భారీ వసూళ్లను సాధించింది. కింగ్ ఆఫ్ పాప్ మ్యూజిక్, ఐకానిక్ డ్యాన్స్ మూమెంట్స్, ఆయన జీవితంలోని లోతైన సంఘర్షణలను దర్శకుడు ఆంటోనీ ఫుక్వా వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించడంతో అంతర్జాతీయ ప్రేక్షకులతో పాటు భారతీయ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారు. ముఖ్యంగా మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ పాత్రలో ఒదిగిపోయిన తీరుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్, డ్యాన్స్ విన్యాసాలు చూస్తుంటే సాక్షాత్తు మైఖేల్ జాక్సనే మళ్లీ తిరిగి వచ్చారా అన్నట్లుగా ఉందని విమర్శకులు సైతం కొనియాడుతున్నారు.

PRINTED, PUBLISHED and OWNED BY **G.THIRUPATHI,** PRINTED AT **SRK PRINTERS,** (V) KOKKERAKUNTA, RAMADUGU MANDAL, KARIMNAGAR DIST. 505001, TELANGANA, PUBLISHED FROM H.NO.10-6-219, KISAN NAGAR, KARIMNAGAR 505001, TELANGANA, **RNI NO.TELTEL/2006/69862,** EDITOR: **BANDARI MARUTHI**